

ఉప్పాడలో సముద్రంలో అలల కల్లోలం.. కాకినాడ నగరంలో కురుస్తున్న వర్షం

వానే వాన!

- అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వర్షాలు
- రెండు రోజుల్లో మరింతగా బలపడి తీవ్ర అల్పపీడనంగా మార్పు
- ఒడిషా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలతో గోదావరికి పెరగనున్న ఇన్‌ఫ్లో
- సముద్రం అల్లకల్లోలంతో కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతులకు బ్రేక్
- ఆఫ్రికాకు వెళ్లాల్సిన ఆరు షిప్‌ల్లో నిలిచిన లోడింగ్
- ఉప్పాడతోపాటు కోనసీమలో తీరం వెంబడి ఎగసిపడుతున్న అలలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం రోజంతా ముసురేసింది. అక్కడక్కడ భారీ నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అయితే ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం బలపడి రెండు రోజుల్లో తీవ్ర అల్పపీడనంగా మారనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో రాబోయే రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురవనున్నట్టు వెల్లడించింది. మరోపక్క ఒడిషా, ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లోను భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గోదావరిలోకి ఇన్‌ఫ్లో మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మరోపక్క అల్పపీడనం ప్రభావంతో కాకినాడ, కోనసీమ జిల్లాల్లో తీరం అల్లకల్లోలంగా మారింది. ఉప్పాడ, అల్లవరం, అంతర్వేది వద్ద అలల ఉధృతి భారీగా పెరిగింది. రాకాసి అలలు అంతెత్తున ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ వద్ద అయితే సముద్రం ముందుకు రావడంతో మత్స్యకార గ్రామాల్లోకి రెండో రోజు కూడా నీరు చేరింది. అయితే తీవ్ర అల్పపీడనంగా ముదిరితే కెరటాల తీవ్రత మరింత పెరగనుంది. మరోపక్క సముద్రంలోపల ఈదురుగాలులు అధికంగా ఉండడంతో కెరటాల ఉధృతి అధికంగా ఉంది. అటు కాకినాడలో రోజంతా వాన కురవడంతో పోర్టులో బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. ఆఫ్రికా దేశానికి బియ్యం ఎగుమతి చేయడానికి ఆరు నౌకలు కొన్ని రోజుల కిందట పోర్టుకు వచ్చాయి. అయితే అలల తీవ్రత, వర్షం కారణంగా బియ్యం లోడింగ్ ఆగిపోయింది. మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు అంచనా వేశారు. ఇదిలాఉంటే అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. కాకినాడ జిల్లా రౌతులపూడిలో అత్యధికంగా 2.8సెంటీమీటర్లు, శంఖవరం 2, కాకినాడ రూరల్ 1.7, పెద్దాపురం 1.2 సెంటీమీటర్లు కురవగా, మిగిలిన అన్ని మండలాల్లో మి.మి.లో వర్షపాతం నమోదైంది. కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 1.2 సెంటీమీటర్లు, రాజోలు 1.1, మండపేట 1.1, తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో 1.1 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురవగా, మిగిలిన అన్ని మండలాల్లో మి.మి. చొప్పున వర్షం కురిసింది. అటు ముసురు వాతావరణంతో పగటి ఉష్ణోగ్రతలు పడిపోయి చలివాతావరణం కొనసాగింది.



ప్రత్తిపాడులో హోరున కురుస్తున్న వర్షం

ఉభయ గోదావరి జిల్లాల వారధికి మరమ్మతులు



- దిండి-చించినాడ మధ్య భారీ వాహనాల రాకపోకలు బంద్ 7
- లైట్ వెయిట్ వాహనాలకే అనుమతి
- ఉభయ గోదావరి జిల్లాల్లో మళ్లింపు

పౌరుల సేవలో 'పుర మిత్ర' 6

కాటేస్తాయి.. జాగ్రత్త!



- పొంచి ఉన్న విషసర్పాల ముప్పు
- జాగ్రత్తగా లేకుంటే అపాయం
- వరదలు, వర్షాలతో జనావాసాల్లోకి విషసర్పాలు
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న పాముకాటు బాధితులు 7
- నెలలోపు పది మంది వరకు మృతి

ఇదేంటి 'బాస్'?

- కాకినాడ రేషన్ బియ్యం కుంభకోణం కథ తేలేదెన్నటికి
- లిక్కర్‌స్కాంపై చార్జిషీటు దాఖలు నేపథ్యంలో రేషన్ స్కాంపై చర్చ
- ఐపీఎస్ అధికారి రవికృష్ణ నేతృత్వంలో సిట్‌కు కొత్త బాస్‌ను నియమించినా కదలని దర్యాప్తు
- ఇప్పటికే పాత సిట్‌ను నియమించి ఎనిమిది నెలలు దాటేసిన వైనం
- గతేడాది నవంబరులో సంచలనం సృష్టించిన స్టెల్లా షిప్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యం
- అప్పటినుంచి కొద్దిరోజులపాటు రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై అట్టుడికిన కాకినాడ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వేలకోట్ల మద్యం కుంభకోణం గుట్టుమట్లు ఆధారాలతో సీఐడీ బయట పెట్టిన నేపథ్యంలో కాకినాడ కేంద్రంగా కొనసాగిన బియ్యం స్కాంపైనా ఎడతెగని చర్చ జరుగుతోంది. పేదల బియ్యాన్ని అడ్డగోలుగా విదేశాలకు ఎగుమతి చేసి వందల కోట్లు మెక్కేసిన కుంభకోణాన్ని సిట్ వెలికితీయాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. బియ్యం అక్రమార్కులను పట్టుకునేందుకు సిట్‌కు ప్రభుత్వం సర్వాధికారాలు కట్టబెట్టిన నేపథ్యంలో ఇప్పటికైనా దర్యాప్తు ప్రారంభించాలని అంతా కోరుతున్నారు. పాత సిట్‌ను నియమించి ఇప్పటికి 8 నెలలు పూర్తవుతున్నా కనీస దర్యాప్తు లేకపోవడంతో అక్రమార్కులు ఎంచక్కా బయటే తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో జాప్యమైనా ఇప్పటికైనా సిట్ కోరలు చాచి బియ్యం కుంభకోణం అంతు తేల్చాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పట్టుబడ్డ రేషన్ బియ్యంపై 13 కేసులు నమోదు చేసిన పోలీసులు సిట్ దర్యాప్తునకు సర్వం సిద్ధం చేశారు. ఇంకా కాలు కదల్చకపోవడంతో కేసు నీరు గార్చేస్తారా అనే అనుమానాలు వ్యక్తమయ్యేలా చేస్తున్నాయి.

ఎక్కడకక్కడ ఊడ్చేసి..

పేదలకు పంపిణీ చేసిన రేషన్‌బియ్యాన్ని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల అక్రమార్కులు భారీగా విదేశాలకు తరలించేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముఠాలు నియమించి పేదల చేతికి అందిన రేషన్ బియ్యాన్ని కిలోకు రూ.10కి కొనుగోలు చేసి లక్షల టన్నులు కాకినాడకు తరలించేశారు. వైసీపీ అధికారంలో ఉన్న కాలంలో అప్పటి కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు బియ్యాన్ని కనివినీ ఎరుగని రీతిలో బొక్కేశారు. పౌరసరఫరాలశాఖ పరిధిలోని రేషన్‌బియ్యం వ్యవస్థను కుళ్లబొడిచేశారు. ప్రభుత్వం వందల కోట్లు సబ్సిడీ చెల్లించి పేదలకు ఇచ్చే బియ్యాన్ని సదరు నేత, ఆయన మనుషులు కారుచౌకగా కొట్టేసి సార్టెక్స్ యంత్రాల్లో పాలిష్ చేసి ఆకర్షణీయ ప్యాకింగ్‌ల్లో నౌకల్లో ఆఫ్రికా దేశాలకు అమ్మేసుకుని వేలకోట్లు గడించారు. వైసీపీ అధికారంలోకి రాకముందు అంతంతమాత్రంగా ఉన్న బియ్యం ఎగుమతులు, ఆ పార్టీ వచ్చాక 2019-2020లో కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి 19లక్షల మెట్రిక్ టన్నులు, 2020-2021లో 27, 2021-2022లో 29, 2022-2023లో 38, 2023-2024లో 24లక్షల మెట్రిక్ టన్నులు తరలించేశారు. ఇలా ఎగుమతి అయిన బియ్యంలో సగానికిపైగా పేదలకు పంపిణీ చేసిన రేషనే ఉంది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి, ఆయన ప్రధాన అనుచరుడు వినోద్ అగర్వాల్‌కు చెందిన రెండు కంపెనీలు వైసీపీ హయాంలో రూ.4,995 కోట్ల విలువైన 13.41లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం విదేశాలకు విక్రయించాయి. గతేడాది నవంబరు నెలాఖరులో కాకినాడ నుంచి పశ్చిమ ఆఫ్రికా దేశానికి స్టెల్లా నౌకలో ఎగుమతికి సిద్ధం చేసిన రేషన్‌బియ్యం పట్టుబడ్డంతో స్మగ్లింగ్ వ్యవహారం అధికారికంగా బయటకు వచ్చింది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్వయంగా షిప్ వద్దకు వెళ్లి షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు. అదేసమయంలో కాకినాడ, చుట్టుపక్కల అనేక గోదాముల్లో తనిఖీలు చేస్తే ఎగుమతికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుబడింది. ఈ వేలకోట్ల రేషన్ బియ్యం కుంభకోణం నిగ్గు తేల్చడం కోసం 2024, డిసెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సిట్‌ను నియమించింది. రేషన్‌బియ్యం కాకినాడకు నలుమూలలనుంచి ఎలా చేరుకుంటోంది? ఎవరు తరలిస్తున్నారు? ఎక్కడినుంచి తరలిస్తున్నారు? అక్కడినుంచి ఏయే గోదాముల నుంచి మిల్లులకు వెళ్లి పాలిష్ చేసుకుని ఏయే కంపెనీల ద్వారా నౌకల్లో విదేశాలకు తరలిపోయాయి? అనే దానిపై ఈసిట్ బృందం దర్యాప్తు చేపడుతుందని పేర్కొంది. ఈక్రమంలో దర్యాప్తులో భాగంగా నిందితులను తక్షణం అరెస్టు చేసే అధికారం సైతం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



కాకినాడ పోర్టులో స్టెల్లా నౌకలో పట్టుబడ్డ రేషన్ బియ్యం(ఫైల్)

అయినా కాలు కదల్చరేంటో..

కాకినాడ, చుట్టుపక్క ఐదు పోలీసుస్టేషన్ల పరిధిలో గతేడాది జూన్, జూలై నెలల్లో 13 రేషన్‌బియ్యం స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. వీటన్నింటిపైనా కూలంకషంగా దర్యాప్తు చేయాలని సిట్‌ను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సిట్‌కోసం 13 కేసులపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టి సిట్ దర్యాప్తునకు వస్తే తక్షణ నివేదిక ఇచ్చేలా వివరాలు సిద్ధం చేశారు. సిట్ దర్యాప్తు చేయనున్న ఈ 13 కేసులకు సంబంధించి మొత్తం రూ.84.87 కోట్ల విలువైన 22,947మెట్రిక్‌టన్నుల రేషన్‌బియ్యం ఉంది. ఇందులో ద్వారంపూడి అనుచరులే అధికంగా ఉన్నారు. పైగా క్షేత్రస్థాయిలో పక్కా ఆధారాలు లభించడంతో ఆయా కంపెనీలకు పోలీసులు నోటీసులు పంపించారు. సిట్ గతేడాది డిసెంబర్‌లో దర్యాప్తు ప్రారంభించడమే తరువాయి అనుకున్న సమయంలో దాని అధిపతి వినీత్ బ్రిజిలాల్ కాడెత్తేశారు. సిట్ చీఫ్ హోదాలో ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదు. సిట్ సభ్యులతో కూడా మాట్లాడలేదు. విచారణకు సిట్‌సభ్యులు సిద్ధంగానే ఉన్నా దాని బాస్ బ్రిజిలాల్ అనాసక్తి కనబర్చడంతో విచారణ ఐదు నెలలు ఆగిపోయింది. ఆ తర్వాత సదరు అధికారి ఉన్నట్టుండి కేంద్ర సర్వీసులకు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. దీంతో మళ్లీ ప్రభుత్వం పాత సిట్‌ను పునర్వ్యవస్థీకరించింది. కొత్తబాస్‌గా ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణను నియమిస్తూ ఆదేశాలు జారీచేసింది. సిట్ సభ్యులుగా సీఐడీ ఎస్పీ అయిన ఐపీఎస్ అధికారి బి.ఉమామహేశ్వర్, కాకినాడ బీసీ వెల్ఫేర్ ఈడీ ఏ.శ్రీనివాసరావు, కర్నూలు ఐసీడీఎస్ ఆర్జేడీ పి.రోహిణి, విజయనగరం డీఎస్‌వో కె.మధుసూదనరావు, కోనసీమ జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.బాలసరస్వతిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో అంతా ఓకే అనుకుంటే ఈ సిట్ కూడా ఇంకా సెట్ అవకపోవడంతో కేసు నీరుగారిపోతుందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఒకపక్క మద్యం కుంభకోణంపై సీఐడీ జూలు విదిల్చి నిర్విరామ దర్యాప్తుతో నిందితులను పట్టుకుంది. అదే సమయంలో బియ్యం కుంభకోణంపై మాత్రం సిట్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.దీంతో అసలు బియ్యం స్కాం ముందుకు కదలుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క ఇప్పటికైనా సిట్ దూకుడు ప్రదర్శిస్తే రేషన్ బియ్యం ఎగుమతి దొంగలు సులువుగానే దొరకనున్నారు. కానీ ఆ దిశగా అడుగులు ఎప్పటికి పడతాయనేదే చిక్కుముడిగా మారింది.

స్పా సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు

కాకినాడ క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆదేశాలతో కాకినాడ నగరంలో ఎస్‌డీపీవో పాటిల్ మనీష్‌దేవరాజ్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కాకినాడ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, పోర్టు పోలీస్‌స్టేషన్ల సీఐలు ఎం.నాగదుర్గారావు, మజ్జి అప్పలనాయుడు, కేవీవీ సత్యనారాయణ, పి.సునీల్‌కుమార్ బృందం కాకినాడ నగరంలోని అన్ని సెలూన్‌లు, స్పాసెంటర్లపై ఏక కాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆయా సెంటర్లలో జరుగుతున్న కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్పాసెంటర్ల ముసుగులో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిసినా ఆ కేంద్రాలను సీజ్ చేసి నిర్వాహకులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌డీపీవో హెచ్చరించారు.



స్పాసెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌డీపీవో బృందం

బలవంతంగా వ్యభిచారంలోకి దింపారు 7

- కలెక్టర్‌కు బాధితురాలి వినతిపత్రం

పెద్దాపురంలో వ్యభిచార గృహంపై దాడి

- ముగ్గురు విటులు, నిర్వాహకురాలి అరెస్ట్ 7

సత్యదేవుడి ఆలయం ముస్తాబు

- నేటినుంచి సత్యదేవుడి 135వ ఆవిర్భావ దినోత్సవాలు
- రెండురోజులపాటు కార్యక్రమాలు

అన్నవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి 135వ ఆవిర్భావ దినోత్సవాలు ఈనెల 26వతేదీ శుక్రవారంనుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో అనివేటి మండపంలో వివిధ రకాలైన పండ్లు, పువ్వులతో అలంకరణ చేపట్టారు. రెండురోజులపాటు ఈకార్యక్రమాలు జరగనుండగా శనివారం ఆవిర్భావ దినోత్సవం జరుపుతారు. ఉదయం 9.15గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు రెండురోజుల పాటు నిర్వహిస్తున్నారు. శనివారం రోజున పంచామృతాభిషేకాలు, ఆయుష్యహోమం, కొండపై వెండిరథంతో ప్రాకారసేవ, రాత్రికి కొండ దిగువన గరుడ వాహన సేవను నిర్వహించనున్నట్లు ఈవో సుబ్బారావు తెలిపారు. ఈ ఏడాది ఆరుగురు పండితులను, 12మంది ఉద్యోగ విరమణ చేసిన వైదిక సిబ్బందికి పంచె, కండువా, నగదు పురస్కారాలతో సత్కరించనున్నామని చెప్పారు.

జాగా కనిపిస్తే కబ్జా!

- కాకినాడ రూరల్ మండలం తమ్మవరంలో 50 ఎకరాల ప్రభుత్వ చెరువు కబ్జాకు యత్నం
- సరిహద్దు రాళ్లతో ఫెన్సింగ్‌కి ఏర్పాట్లు
- అడ్డుకున్న గ్రామస్తులు

సర్పవరం జంక్షన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో ఏ కొద్దిపాటి జాగా అయినా కబ్జా చేసేందుకు కబ్జాదారులు వెనుకడుగు వేయట్లేదు. ఎకరా కోటి నుంచి రూ.5కోట్ల ధర పలకడంతో కనిపించిన ఖాళీస్థలం, సామాజికస్థలం, ప్రభుత్వ భూమి, చెరువు ఇలా ఏదైనా ఆక్రమణకు వారు గద్దల్లా వాలిపోతున్నారు. నకిలీ దస్తావేజులు సృష్టించి, సరిహద్దునున్న సర్వే నెంబరుకు పక్కన సబ్ తగిలించి రిజిస్ట్రేషన్లు చేయించుకుని భూములను తన్నుకుపోయేందుకు యత్నిస్తున్నారు.కాకినాడ రూరల్ తమ్మవరంలో 50ఎకరాల ప్రభుత్వ చెరువును తప్పుడు దస్త్రాలతో ఆక్రమించుకునేందుకు కొందరు వ్యక్తులు చెరువు భూమిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయగా గ్రామస్తులు అడ్డుకున్నారు.

వంద కోట్ల ప్రభుత్వ చెరువును సైతం..

కాకినాడ రూరల్ మండలం తమ్మవరంలో సర్వేనెం.60లో 50.80 ఎకరాల ప్రభుత్వ భూమి చెరువుగా రెవెన్యూ రికార్డుల్లో పెయిర్ అడంగళ్లలో నమోదై ఉంది. వర్షాలకు కురిసిన నీటిని ఈ చెరువులో నిల్వ చేసేవారు. ఈ చెరువుపై ఆధారపడి స్థానిక, చుట్టుపక్కల రైతులు వ్యవసాయ సాగుచేసేవారు. ఈచెరువులో 8ఎకరాల భూమిని పేద దళితులు సాగు చేసుకునేవారు. మరో 8ఎకరాల భూమిలో రజకులు వారి జీవనోపాధికి వినియోగించుకునేవారు. కాలక్రమేణా వ్యవసాయసాగుకు గోదావరి నుంచి సాగునీటి సరఫరా కావడంతో ఈ చెరువు ఆయకట్టుపై సాగవుతున్న వరిసాగుకు ఈ చెరువు నీరు అవసరం లేకుండాపోయింది. గ్రామఅవసరాలకు చెరువుఖాళీగా ఉండిపోయింది. గత వైసీపీ ప్రభుత్వహయాంలో పేదలందరికీ పక్కాఇళ్లకోసం తమ్మవరంలో ఉన్న 50 ఎకరాల చెరువును ఇళ్లస్థలాలుగా ఇచ్చేందుకు పరిశీలించారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు చెరువుల్లో ఎటువంటి నిర్మాణాలు, ఇళ్లస్థలాలు ఇవ్వరాదని నిబంధనలు ఉండడం, చెరువు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో గత ప్రభుత్వ పెద్దలు ఈ ప్రయత్నాలను విరమించుకున్నారు. తమ్మవరంలో ఎకరా భూమి రూ.2కోట్లు పైబడి పలకడంతో కబ్జాదారులు చెరువును మింగేసేందుకు పావులు కదిపారు. మూడురోజులక్రితం కొంతమంది ఈ చెరువులోకి చొరబడి సరిహద్దు రాళ్లు వేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇది తెలిసిన స్థానికులు అక్కడకు వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ చెరువు తమపూర్వీకులదంటూ పిఠాపురం మహారాజా వారు సిపాయిమాన్యం కింద తమకు చెరువు దఖలు చేశారని చెప్పడంతో గ్రామస్తులు ఎదురుతిరిగారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేయడంతో వీఆర్వో వచ్చి రాళ్లు వేయకుండా ఆక్రమణకు అడ్డుకట్ట వేశారు. చెరువు ఆక్రమణకు ప్రయత్నించిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. రెవెన్యూ అడంగల్ ప్రకారం ఇది ప్రభుత్వ చెరువు అని, ఆక్రమణకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని వీఆర్వో సత్యనారాయణ హెచ్చరించారు.



తమ్మవరంలో 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ చెరువు

మహారాజావారి సిపాయి మాన్యం అంటూ..

తమ్మవరం చెరువు పిఠాపురం మహారాజా వారు సిపాయి మాన్యం కింద తమకు ఈ చెరువు దఖలపడి ఉందని, అందుకు తగ్గ డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ ఉందంటూ వాసంశెట్టి ఇంటి పేరుకు చెందిన పలువురు కుటుంబీకుల పేరుతో ఈ చెరువును ఆక్రమించుకునేందుకు కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నారు. 1947కి ముందు నుంచి రెవెన్యూ దస్త్రాల్లో పెయిర్ అడంగళ్లలో ప్రభుత్వ చెరువుగా ఉందని, ఈ రికార్డులను కాదని నకిలీ రికార్డులతో చెరువును ఆక్రమించుకునేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు సంరక్షణకు రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో నాట్లు వేసేందుకు సిద్ధమైన పొలం మధ్యలో వరి మడి

జోరుగా వరినాట్లు

- మెట్టలో ఊపందుకున్న ఖరీఫ్ వ్యవసాయ పనులు
- వర్షాలు కురుస్తుండడంతో వరినాట్లు వేస్తున్న రైతులు

ప్రత్తిపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఐదురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వరినాట్ల పనులు ముమ్మరం చేశారు. జగ్గంపేట వ్యవసాయశాఖ సబ్‌డివిజన్‌లోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో వరినాట్ల పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ సబ్‌డివిజన్‌లో గండేపల్లిలో రికార్డుస్థాయిలో వరినాట్లు పడ్డాయి. జగ్గంపేట డివిజన్ పరిధిలోని 4మండలాల్లో 41,170 ఎకరాల్లో వరినాట్లు వేస్తుండగా ప్రస్తుతం 7268 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. గురువారం నుంచి ఈ వరినాట్ల వేగం మరింత పెరిగి అన్ని గ్రామాల్లో రైతులు జోరుగా పనులు చేపట్టారు. పొలాల్లో దుక్కి దున్నడం.. ఒకవైపు, నాట్లు వేసే పనులు జోరుగా సాగుతున్నాయి. గండేపల్లి మండలంలో 7,100 ఎకరాలకుగాను 4965 ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. ప్రత్తిపాడులో 10,300 ఎకరాలకుగాను 830 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. జగ్గంపేటలో 10,020 ఎకరాలకు 950ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ఏలేశ్వరం మండలంలో 13,750 ఎకరాలకు గాను 523 ఎకరాల్లో వరినాట్లు పూర్తి చేశారు. కురుస్తున్న వర్షాలు వ్యవసాయ ఖరీఫ్ సీజన్ పనులకు అనుకూలం కావడంతో ఈ వారంలో 50శాతం నాట్లు పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఏలేశ్వరం రిజర్వాయర్, ప్రత్తిపాడు మండలంలోని సుబ్బారెడ్డి సాగర్ వంటి ప్రాజెక్టుల్లోకి పెద్దఎత్తున వర్షపునీరు తరలివస్తోంది. దీంతో ఆయకట్టు పొలాల్లో ఖరీఫ్ పనులు ముమ్మరం అవడానికి దోహదపడ్డాయి.

పంటల బీమా... ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరి తదితర పంటలకు నష్టం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించిన రైతులకు అండగా నిలుస్తోంది. రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులు, సొసైటీలు బీమా ప్రీమియం వసూలు చేసి చెల్లిస్తారు. మిగిలిన రైతులు మాత్రం సచివాలయాలు, పోస్టాఫీసుల ద్వారా, ఆన్‌లైన్‌లో నేరుగా చెల్లించే అవకాశం ఉంది. పంటల బీమాపై వ్యవసాయ శాఖ ప్రచారం చేస్తున్నా రుణాలు తీసుకోని రైతులు అంతగా ఆసక్తి చూపించట్లేదు. ఫలితంగా ఏదైనా నష్టం జరిగినప్పుడు అన్నదాతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



రైతులకు ధీమా

- సకాలంలో ప్రీమియం చెల్లిస్తే అండగా నిలుస్తుంది
- దిగుబడి ఆధారంగా పంటలకు బీమా వర్తింపు
- వరికి గ్రామం యూనిట్‌గా అమలు
- రుణాలు తీసుకుంటే బ్యాంకులు, సొసైటీల ద్వారా ప్రీమియం చెల్లింపు
- మిగిలిన రైతులు సచివాలయాల ద్వారా చెల్లించే అవకాశం
- వరికి ఆగస్టు 15 చివరి తేదీ

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గాడిలో పెట్టింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. అమలు బాధ్యతను జిల్లాల వారీగా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించారు. కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో పంటల బీమా పథకాన్ని ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేయనుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ పథకాన్ని టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేస్తారు. వీరు నోడల్ ఏజెన్సీలుగా ఉండి రైతుల నుంచి ప్రీమియం వసూలు, నష్టాలు జరిగినప్పుడు పరిహారం చెల్లిస్తారు.

వర్తింపు ఇలా ...

జిల్లాల వారీగా ఎంపిక చేసిన పంటలకే బీమా వర్తింపచేస్తున్నారు. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో దిగుబడి ఆధారిత బీమా అమలులో ఉంది. వరి తదితర పంటలకు బీమా మొత్తానికి 1.5 నుంచి 2 శాతం వంతున రైతులు ప్రీమియంగా చెల్లిస్తే సరిపోతుంది. వరి పంటకు గ్రామం యూనిట్‌గా బీమాను అమలు చేస్తారు. పంట కోత ప్రయోగాల ద్వారా లెక్కించిన వాస్తవ దిగుబడిని, గత ఏడు సంవత్సరాల ఆధారంగా లెక్కించిన సగటు దిగుబడిని పోల్చి ఏ మేరకు దిగుబడి తగ్గిందో అంతమేర శాతాన్ని పరిహారంగా చెల్లిస్తారు. ఇందుకు ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని దిగుబడి లెక్కలు వేస్తారు.

ఎలా చెల్లించాలి

పంటలకు ప్రభుత్వం, బీమా సంస్థలు నిర్దేశించిన ప్రీమియంలో రైతు వాటాను చెల్లించి పంటల బీమా పొందవచ్చు. ఇందుకు రైతులతో పాటు కౌలు రైతులూ అర్హులే. ఏయే పంటలకు బీమాను వర్తింపచేశారో ఆ పంటలకు సంబంధించి బ్యాంకులు, సొసైటీలు ద్వారా రుణం పొందినప్పుడు వారే బీమా ప్రీమియం వసూలు చేసి ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లిస్తారు. ఒకవేళ బీమా మంజూరైతే సంబంధిత రైతు రుణ ఖాతా ద్వారా పరిహారం చెల్లిస్తారు.

రుణాలు తీసుకోని రైతులు, కౌలు రైతులు గ్రామ, వార్డు సచివాలయాలు, పోస్టాఫీసుల ద్వారా ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలి. ఇందుకు రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్ పుస్తకం, లేదా కౌలు రైతు కార్డు, పంట వేసినట్టు ధ్రువపత్రం, బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలి. లేకుంటే నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ (ఎన్‌సీఐపీ) పోర్టల్ ద్వారా రైతులే నేరుగా తమ వివరాలు నమోదు చేసి ప్రీమియం చెల్లించవచ్చు. పంట నష్టం జరిగి పరిహారం వస్తే వారు ఇచ్చిన బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. బీమా చేసిన పంటల వివరాలు ఈ-క్రాప్‌లో సక్రమంగా నమోదయ్యాయో లేదో రైతులు తప్పనిసరిగా చూసుకోవాలి.

స్పందన అంతంతమాత్రమే

పంటల బీమా పథకానికి ప్రీమియం చెల్లించడం ద్వారా సాగుకు ధీమా ఏర్పడుతుందని వ్యవసాయ శాఖ విస్తృత ప్రచారం సాగిస్తున్నా రైతుల నుంచి అంతంతమాత్రంగానే స్పందన లభిస్తోంది. రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులు, సొసైటీలే ప్రీమియం వసూలు చేసి చెల్లిస్తున్నందున వారందరికీ బీమా వర్తిస్తోంది. వీరికి రెండు, మూడు రెట్లు అధికంగా రుణాలు తీసుకోని రైతులు ఉంటారు. వీరిలో కనీసం ఒక శాతం మంది రైతులు కూడా ఇప్పటిదాకా ప్రీమియం చెల్లించలేదు. గతంలో లెక్కలను పరిగణలోకి తీసుకున్నా వీరిది ఎప్పుడూ 3-4శాతం లోపుగానే ఉంది.

మిగిలిన పంటలకు నెలాఖరు వరకే

ఎంపిక చేసిన వరి కాకుండా మిగిలిన పంటలకు పంటలకు రైతులు బీమా చేయించుకునేందుకు ఈ నెలాఖరులోగా ప్రీమియం చెల్లించాలి. వరికి మాత్రం ఆగస్టు 15 వరకు అవకాశం ఉంది. బ్యాంకులు, సొసైటీల ద్వారా రుణాలు తీసుకునే రైతులకు ఇదే గడువు వర్తిస్తుంది. కాకినాడ జిల్లాలో వరికి ఎకరానికి రూ.769.23, తూర్పు గోదావరి జిల్లాలో రూ.576.92, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో రూ.646.15 ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది. ఆయా జిల్లాల పరిస్థితుల ఆధారంగా ప్రీమియం, రైతు వాటాగా చెల్లించాల్సిన మొత్తాలను నిర్ధారించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మాత్రం ఎకరాకు కేవలం రూ.76 చెల్లిస్తే సరిపోతుంది.

సకాలంలో ప్రీమియం చెల్లించాలి

పి.స్వాతి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు, పిఠాపురం



ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వరి సాగు చేసే రైతులు సకాలంలో ప్రీమియం చెల్లించడం ద్వారా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు, వరదల కారణంగా పంటలకు నష్టం జరిగితే గ్రామం యూనిట్‌గా అంచనాలు వేసి పరిహారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా చెల్లిస్తారు. దీనివల్ల రైతులకు పంటలపై పెట్టే పెట్టుబడికి భరోసా లభిస్తుంది. రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకులు, సొసైటీలు ద్వారా తీసుకోని రైతులు సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ ప్రీమియాన్ని ఆగస్టు 15వ తేదీలోగా చెల్లించాలి.

జిల్లా	పంట	బీమా యూనిట్	బీమా మొత్తం (ఎకరా/హెక్టారు)	రైతుల వాటా (శాతం)	ప్రీమియం మొత్తం (ఎకరా/హెక్టారు)
కాకినాడ	వరి	గ్రామం	38,462/95,000	2.00	769.23/1900.00
తూర్పు గోదావరి	వరి మినుము	గ్రామం మండలం	38,462/95,000 20,243/50,000	1.50 1.50	76.92/1425.00 303.64/750.00
అల్లూరి	వరి మొక్కజొన్న రాగి పసుపు	గ్రామం మండలం మండలం జిల్లా	42,510/1,05,000 33,401/82,500 17,206/42,500 89069/2,20,000	1.52 1.50 1.50 1.50	646.15/1596.00 501.01/1237.50 258.10/637.50 1336.03/3300.00
కోనసీమ	వరి	గ్రామం	38,000		76.00

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో నివసిస్తున్న ప్రజలు వారి సమస్యలపై ఇక నుంచి కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేదు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అనేక పౌర సేవలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 'పుర మిత్ర' యాప్‌కు రూపకల్పన చేసింది. ఏఐ సహకారంతో రూపొందించిన ఈ యాప్ పుర పౌరులకు అందుబాటులోకి వచ్చింది.



పౌరుల సేవలో పుర మిత్ర

- ఇక ఇంటి నుంచే దరఖాస్తులు, ఫిర్యాదులు
- అందుబాటులోకి వాట్సాప్ యాప్



కార్పొరేషన్ (కాకినాడ), జూలై 24 (ఆంధ్రజ్యోతి): పుర మిత్ర యాప్ అందుబాటులోకి రావడంతో దరఖాస్తులు ఇచ్చేందుకు మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లవలసిన అవసరం లేదు. క్యూలైన్లలో వేచి ఉండక్కర్లేదు. ఇంట్లోనే కూర్చుని ఫిర్యాదు చేయొచ్చు. ఇతర సేవలు పొందవచ్చు. ప్రస్తుతం ప్రతి సోమవారం పురపాలక కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అక్కడికి వెళ్లి అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పుడు పురమిత్ర యాప్‌లోనే ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. పన్ను చెల్లింపులు, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు పొందడంతో పాటు అన్ని రకాల బిల్లులను ఈ యాప్ ద్వారా చెల్లించే వెసులుబాటు కల్పించారు.

150 రకాల సేవలు

మొబైల్‌లో ప్లే స్టోర్‌కి వెళ్లి పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో రెవెన్యూ, ప్రజారోగ్యం, తాగునీరు, పట్టణ ప్రణాళికా విభాగం, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్, అకౌంట్స్, పరిపాలనా విభాగం పొందుపరిచారు. దశలవారీగా 150 రకాల సేవలను పురమిత్ర యాప్ ద్వారా వినియోగించుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పురప్రజలకు కల్పించింది.

చిత్రం తీసి.. వాయిస్ రికార్డింగ్..

ఆయా ప్రాంతాల్లో సమస్యకు సంబంధించిన చిత్రాన్ని తీసి.. వాయిస్ రికార్డు చేస్తే అక్షరాలు టైప్ అయ్యేలా యాప్ రూపొందించారు. పంపిన సమస్యకు సంబంధించిన సమాచారం సంబంధిత విభాగ అధిపతులకు నేరుగా చేరుతుంది. ఆ సమస్య తీవ్రతను బట్టి పరిష్కరించేందుకు మూడు నుంచి 15 రోజులు, గరిష్ఠంగా 30 రోజుల వ్యవధి నిర్ణయించారు.

పరిష్కరించకపోతే...

పురమిత్ర యాప్‌లో పొందుపరిచిన సమస్యను సంబంధిత అధికారి గడువులోగా పరిష్కరించాలి. ఆ చిత్రాన్ని యాప్‌లో అధికారి అప్‌లోడ్ చేయాలి. ఈ విధానం వల్ల ఫిర్యాదుదారులు పురోగతి తెలుసుకునేందుకు వీలవుతుంది. ఒకవేళ అధికారి స్పందించి సమస్యపై పరిష్కరించకపోతే అది పైస్థాయి అధికారి పరిగణలోకి వెళ్తుంది. ఆపై సంబంధిత అధికారి బాధ్యుడు అయ్యేలా యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది.

ప్రచారానికి నోచుకోని యాప్

ప్రభుత్వం ఈ యాప్‌ను మంచి ఉద్దేశ్యంతో తీసుకొచ్చినప్పటికీ తగిన ప్రచారం లేక ప్రజలకు అందుబాటులోకి రావట్లేదు. వారు పలు సమస్యలపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతులు అందిస్తున్నారు. ఇలాంటి యాప్ ఒకటి అందుబాటులోకి వస్తే ప్రజల నుంచి మరిన్ని సమస్యలు అందుకోవాల్సి ఉంటుందని భయంతో అధికారులు గోప్యంగా ఉంచుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తగిన ప్రచారం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

చేపలవేటలో టిండాల్ కమ్ డ్రైవర్ కోర్సులో శిక్షణ

ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ అంజలి

కాకినాడ సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా యంత్రపు నావ, బోటులో చేపలవేట సాగించేవారికి టిండాల్ కమ్ డ్రైవర్ కోర్సులో ఏడాది పాటు శిక్షణ ఇస్తున్నట్టు రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ(ఎస్ఐఎఫ్‌టీ) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అంజలి తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 74వ బ్యాచ్ ప్రారంభమవుతుందన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు, పుదుచ్చేరి నుంచి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్ల జెరాక్స్‌లు జతపరచి ఆయా జిల్లాల మత్స్యశాఖ అధికారి వారి కార్యాలయంలో అందజేయాలన్నారు. నేరుగా కూడా ఈ కార్యాలయానికి అందేటట్టు పోస్టల్ ద్వారా పంపవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 22వ తేదీ ఉదయం 10గంటలకు కాకినాడ జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య సాంకేతి పరిజ్ఞాన సంస్థలో ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. దరకాస్తు నమూనా, పూర్తి వివరాలు ఈ నెల 25వ తేదీ నుంచి వెబ్‌సైట్‌లో లభ్యమవుతాయని ప్రిన్సిపాల్ అంజలి పేర్కొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘంలో అక్రమాలు

- విచారణ చేయాలి.. నిబంధనల ప్రకారం ఎన్నికలు జరిపించాలి
- కాకినాడ జిల్లా కలెక్టర్‌కు డ్రైవర్ల వినతి


కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ వాహనాల డ్రైవర్లు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖలో గత పాలకవర్గం పాల్పడిన అక్రమాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వ డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ప్రభుత్వ డ్రైవర్లు సరిపల్లి కృష్ణవర్మ, జి.రాంబాబు, కె.రవికుమార్, పి.శ్రీనివాస్‌లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత పాలకవర్గంలో ఉన్న ఎస్.శ్రీనివాసరావు హయాంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. రూ.1.40 కోట్లకు లెక్కలు చూపించడంలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. సంఘం నిబంధనల ప్రకారం ఆడిట్ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలన్నారు. అలాగే ఎనిమిదేళ్ల నుంచి సంఘం ఎన్నికలు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఎన్నికలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దుర్వినియోగం అయిన సొమ్మును అప్పటి అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి నుంచి రికవరీ చేయించాలని ప్రభుత్వ డ్రైవర్లు డిమాండ్ చేశారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.1.52 కోట్లు

హుండీల లెక్కింపు.. బంగారం 47 గ్రాములు, వెండి 1.600 కిలోలు, 24 విదేశీ కరెన్సీ నోట్లు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యాలు

ఆత్రేయపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండి కానుకల లెక్కింపు గురువారం నిర్వహించారు. పర్యవేక్షణాధికారులు డి.సురేష్‌బాబు, డీవీఎస్ఆర్ ప్రసాద్ సమక్షంలో స్వామివారి కానుకలు లెక్కింపు నిర్వహించారు. 28 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా రూ.1,26,78,200, అన్నప్రసాద హుండీల ద్వారా రూ. 26,12,993 వెరసి రూ.1,52,91,193 ఆదాయం లభించింది. అలాగే బంగారం 47 గ్రాములు, వెండి 1.600 కిలోలు, 11 దేశాల 24 విదేశీ కరెన్సీ నోట్లు హుండీ ద్వారా లభించిన్నట్టు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది, గ్రామస్థులు, చైతన్య గోదావరి బ్యాంకు ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ జీఎస్ఎల్

- జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ముగిసిన మహిళా గేమ్స్ మీట్
- 24 కళాశాలల నుంచి 547 మంది విద్యార్థినులు హాజరు
- క్రీడలు దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తాయి
- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి




ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన జీఎస్ఎల్ జట్టు, మాట్లాడుతున్న డాక్టర్ రాధికారెడ్డి

రాజానగరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): క్రీడలు దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తాయని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలోని మెడికల్, డెంటల్ కళాశాలల 25వ మహిళా గేమ్స్ మీట్ గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ఎస్ మిశ్రా అధ్యక్షత జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ అన్ని రంగాల్లో ముందంజలో ఉంటే దానిలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ముందడుగు వేస్తోందన్నారు. జీఎస్ఎల్ సంస్థల చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనలో రాజీపడేది లేదని డాక్టర్ గన్ని స్పష్టం చేశారు. యూనివర్శిటీ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ ఇ.త్రిమూర్తి మాట్లాడుతూ 24 కళాశాలల నుంచి 527 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని, ఓవరాల్ చాంపియన్ షిప్‌ను జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ సొంతం చేసుకుందన్నారు.

విజేతల వివరాలు...

- బాస్కెట్ బాల్ పోటీల్లో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల(రాజమహేంద్రవరం) జట్టు విన్నర్‌గా, పీఎస్ఐఎంఎస్(చిన్నఅవుట్లపల్లి) రన్నర్‌గా, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల(గుంటూరు), ఎంఐఎంఎస్ (విజయనగరం) తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి.
- వాలీబాల్ పోటీల్లో ఆశ్రమ్ మెడికల్ కళాశాల(ఏలూరు), పీఎస్ఐఎంఎస్ కళాశాలలు సంయుక్తంగా విన్నర్స్‌గా నిలవగా, సిద్ధార్థ మెడికల్ కళాశాల(విజయవాడ), రంగరాయ మెడికల్ కళాశాల (కాకినాడ) మెడికల్ కళాశాలలు తృతీయ స్థానాల్లో నిలిచాయి.
- త్రోబాల్ పోటీల్లో కోనసీమ మెడికల్ కళాశాల(అమలాపురం) విన్నర్‌గా, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల(రాజమహేంద్రవరం) రన్నర్‌గా నిలవగా, నారాయణ డెంటల్ కాలేజీ(నెల్లూరు), కోనసీమ డెంటల్ కాలేజీ (అమలాపురం) తృతీయ స్థానంలో నిలిచాయి.
- బ్యాడ్మింటన్ పోటీల్లో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల విన్నర్‌గా, రంగరాయ మెడికల్ కళాశాల(కాకినాడ) రన్నర్‌గా నిలిచాయి. జీఎస్ఎల్ డెంటల్ కళాశాల, ఆశ్రమ్ మెడికల్ కళాశాలలకు తృతీయ స్థానం లభించింది.
- బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆశ్రమ్ మెడికల్ కళాశాల విన్నర్‌గా, సిద్ధార్థ మెడికల్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. అనిల్ నీరుకొండ డెంటల్ కళాశాల(వైజాగ్), మహారాజా మెడికల్ కళాశాల (విజయనగరం)లు తృతీయ స్థానంలో నిలిచాయి.
- చదరంగం పోటీల్లో రంగరాయ మెడికల్ కళాశాల విన్నర్‌గా, సిద్ధార్థ మెడికల్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల, గవర్నమెంట్ కాలేజీ(గుంటూరు)ల సంయుక్తంగా తృ తీయ స్థానం దక్కింది.
- టెన్నిస్ పోటీల్లో ఎన్ఆర్ఐ కళాశాల (చిన్నకాకాని) విన్నర్‌గా, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల (వైజాగ్) రన్నర్ కైవశం చేసుకున్నాయి. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, సిద్ధార్థ మెడికల్ కళాశాలలు తృతీయ స్థానంలో నిలిచాయి.
- టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల(చిన్నకాకాని) విన్నర్‌గా, గాయత్రి మెడికల్ కళాశాల(వైజాగ్) రన్నర్‌గా నిలిచాయి. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలు సంయుక్తంగా తృతీయ స్థానం దక్కించుకున్నాయని ఎన్టీఆర్ హెల్త్ విశ్వ విద్యాలయం స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ త్రిమూర్తి తెలిపారు.

సముద్ర తీరంలో అలల ఉధృతి


ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాల ఉధృతి

కొత్తపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో అలల ఉధృతి కొనసాగుతోంది. సముద్రం ఉప్పొంగడంతో బుధవారం మాయాపట్నంలో సుమారు 10 మత్స్యకార గృహాలు కొట్టుకొనిపోవడం, సముద్రం నీరు ఇళ్లల్లోకి చేరడం విధితమే. తీరంలో అలల ఉధృతి కారణంగా మత్స్యకారుల్లో కొంత మంది వేటను స్వచ్ఛందంగా విరమించారు. గురువారం అమావాస్య కావడంతో రాత్రిపూట సముద్రం మరింత ఉగ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని మత్స్యకారపెద్దలు చెబుతున్నారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల మత్స్యకారులు వేట సామాగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టారు.

ఒకేసారి.. ఒకే వేదికపై ఐదు స్వర్ణ పతకాలు

జ్వాలకు గవర్నర్ ప్రత్యేక అభినందన


పతకాలు అందుకుంటున్న జ్వాల

అమలాపురం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లి గ్రామానికి చెందిన మోర్త జ్వాల ఒకేసారి ఒకే వేదికపై గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ఐదు స్వర్ణ పతకాలు అందుకుంది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవాన్ని గురువారం విజయవాడ సమీపంలోని ఆత్కూరు స్వర్ణభారతి ట్రస్టులో నిర్వహించారు. 2023 బ్యాచ్‌కు చెందిన జ్వాల యూనివర్శిటీ టాపర్‌గా నిలిచింది. దాంతో శ్రీసీలంరాజు గంగాప్రసాదరావు అండ్ కమల గోల్డ్ మెడల్, శ్రీపరిసాయనాది మెమోరియల్ గోల్డ్ మెడల్, మణి మట్లపూడి మెమోరియల్ గోల్డ్ మెడల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గోల్డ్‌మెడల్, శ్రీరాజా ఇమ్మానియేల్‌రాయల్ కొండేటి గోల్డ్‌మెడల్‌ను ఒకేసారి జ్వాలకు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్‌తోపాటు జ్వాలను వైస్ చాన్సలర్ వి.శారదజయలక్ష్మి, విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఏపీ వేణుప్రసాద్, ఎం.హరిజవహర్‌లాల్ ప్రత్యేకంగా అభినందించారు.

అక్టోబరు 9 నుంచి రెవెన్యూ స్పోర్ట్స్ మీట్

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కాకి నాడ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు


కలెక్టరేట్ (కాకినాడ), జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి రెవెన్యూ స్పోర్ట్స్ మీట్ నిర్వహణకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అనుమతి ఇచ్చారని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు తెలిపారు. గురువారం ఆయన అసోసియేషన్ సభ్యులతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. అనంతరం త్రినాథరావు మీడియాతో మాట్లాడుతూ అక్టోబరు 9 నుంచి 11వ తేదీ వరకు జిల్లా స్థాయి రెవెన్యూ మీట్ నిర్వహిస్తామన్నారు. నవంబరులో స్టేట్ స్పోర్ట్స్ మీట్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రావు, కాకినాడ అర్బన్ తహశీల్దారు జితేంద్ర, ఇతర ప్రతినిధులు సంధ్యారాణి, రమ్య పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి ప్రవాహం

2.16లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి.. డెల్టా కాలువలకు 9100 క్యూసెక్కులు ..


సముద్రంలోకి ప్రవహిస్తున్న వరదనీరు

ధవళేశ్వరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతుంది. పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలు వల్ల ఒక మోస్తరు వర్ద ప్రవాహం గోదావరికి తరలివస్తుంది. గురువారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, మద్దూరు, ర్యాలీ ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను అరమీటరు మేర, విజ్జేశ్వర్ ఆర్మ్‌లోను 39 గేట్లకు గాను 14 గేట్లను .30 మీటర్ల మేర పైకి ఎత్తి 2,16,302 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది.వర్షాలు కురుస్తుండడంతో డెల్టా కాలువలకు నీటి విడుదలను మరింత తగ్గించారు.తూర్పుడెల్టాకు 3300 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3700 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.ఎగువున భద్రాచలం వద్ద 21 అడుగుల వరకు పెరిగిన ఆపై తగ్గుతూ సాయంత్రానికి 20.60 అడుగులకు చేరుకుంది.



కాటేస్తాయి.. జాగ్రత్త!

● పొంచి ఉన్న విషసర్పాల ముప్పు ● జాగ్రత్తగా లేకుంటే ప్రాణాలకే అపాయం ● వరదలు, వర్షాలతో జనావాసాల్లోకి విషసర్పాలు
● ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న పాముకాటు బాధితులు ● నెలలోపు పది మంది వరకు మృతి

విషసర్పాలు మాటేస్తున్నాయి.. జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి.. కాస్త అజాగ్రత్తగా ఉంటే కాటేస్తున్నాయి.. వర్షాలు, వరదల నేపథ్యంలో పాములతో జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి. ఇటీవల కాలంలో రెండు, మూడు నెలలుగా అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. మామూలు రోజుల్లో కూడా ఒక్కోసారి బయట సంచరించే సర్పాలు వర్షాలు పడేసరికి ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేట మండలం ఇరుసుమండకు చెంది న తోట శ్రీనివాసరావు(58) ముక్కామలలో బొండాలు విక్రయిస్తుంటాడు. ఈనెల 16వ తేదీ రాత్రి ఖాళీ బొండాలు తీస్తున్న సమయంలో వాటిలో ఉన్న రక్తపింజర పాము కాటేసింది. దీంతో అతడు మృతి చెందాడు.

● గోకవరం మండలంలోని కొత్తపల్లికి చెందిన తెంటి రవీనామాధురి(22) పాముకాటుకు గురై మృతి చెందింది. జూన్ 24వతేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటివద్ద దుస్తులు ఉతుకుతుండగా నల్లతాచు కుడికాలిపై కాటువేసింది. వెంటనే తండ్రి శ్రీనివాసరావు ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందింది.

● తాళ్లరేవు మండలం పటవలకు చెందిన వడ్డి సంజన(17) ఈనెల 21న ఉదయం ఇంటి పరిసరాల్లో పాము కాటుకు గురైంది. దీంతో వెంటనే ఆమె తల్లి మోటారుసైకిల్‌పై తాళ్లరేవు సీహెచ్‌సీకితీసుకువెళుతుండగా మార్గంమధ్యలో అపస్మారక స్థితికి చేరింది. తర్వాత చికిత్సపొందుతూ ప్రాణాలు విడిచింది.

● తాజాగా ముమ్మిడివరంలో గురువారం ఓ మహిళ పాముకాటుకు గురైంది. వీరే కాదు.. ఇటీవల కాలంలో అనేకమంది పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విషసర్పాల బారిన పడేవారి సంఖ్య పెరుగుతోంది. బాధితులకు తక్షణ వైద్యసాయం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ఆస్పత్రుల్లో యాంటీ వీనమ్ మందు అందుబాటులో ఉన్నా, సమయానికి చేరుకోలేక కొందరు, ఆందోళనతో మరికొందరు ప్రాణాలు విడుస్తున్నారు. మంత్రాలు, నాటు వైద్యం అంటూ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రాణాలకు ముప్పువాటిల్లే పరిస్థితులు తెచ్చుకుంటున్నారు.

పాము కాటుకు గురైన బాధితులను ఆరు గంటలలోపు ఆసుపత్రిలో చేర్చాలి. గాయమైన చోట కట్టు కట్టకుండా శుభ్రంగా కడిగి ఆసుపత్రికి తరలించాలని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం కాకినాడ సెంట్రల్ డ్రగ్ స్టోర్(సీడీఎస్)లో ప్రస్తుతం 4500 వైల్స్ అందుబాటులో ఉన్నాయని, కాకినాడ జీజీహెచ్‌లో 2500 సిద్ధంగా ఉన్నాయని చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జీజీహెచ్‌లు, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు మొత్తం 5వేలకుపైగా డోసులు పంపిణీ చేసినట్టు సీడీఎస్ అధికారులు తెలిపారు.

ఇలాగా చేయాలి..

ముఖ్యంగా ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పాములు సంచరించడానికి ఆస్కారం లేకుండా చూసుకోవాలి. పరిసరాల్లో పిచ్చిమొక్కలు, పొదలు లేకుండా చేయాలి. రాత్రివేళ బయట కచ్చితంగా లైట్ వేసుకునే వెళ్లాలి. అవసరమైతే టార్చ్ సాయంతో బయటకు రావాలి. దగ్గర్లో ఎవరైనా స్నేక్ క్యాచర్ ఉంటే అతడితో పాములను పట్టివేయించాలి. అనుమానం ఉంటే.. పరిసరాల్లో పాములు రాకుండా రసాయన మందులు పిచికారీ చేయించుకోవాలి. ఇటీవల కాలంలో బైకుల్లోకి, బూట్లలోకి, వాషింగ్‌మెషీన్లలోకి మనం ఏమాత్రం ఊహించని కొన్ని వస్తువుల్లోకి సైతం విషసర్పాలు చేరుతున్నాయి. ఇలాంటి బయట ఉన్న వస్తువులను బాగా పరిశీలించిన తర్వాత మాత్రమే వాడాలి.

వర్షాకాలంలో అధికం..

ఏటా వర్షాకాలం, వరదల సమయాల్లో విషసర్పాల సంచారం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం వర్షాకాలంలో పాములు పుట్టలు, ఇతర ప్రాంతాలనుంచి బయటకు వస్తుంటాయి. వేడి ప్రాంతాలను ఎంచుకునే సమయంలో నివాసగృహాల చెంతకు చేరుతాయి. ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు, గోదావరి వరదల సీజన్‌లో ఎగువ ప్రాంతాల నుంచివచ్చేనీటిలో కొట్టుకొస్తాయి. వీటి ఆవాసాలకు లంకలు అనువుగా ఉండడంతో సర్పాల సంతతిపెరుగుతుంది.

కరిస్తే.. ఇలా చేయాలి..

పాము కరిచిన చోట కట్టుకట్టకూడదు. ఆ ప్రాంతాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి. కాటు వేసిన భాగంనుంచి విషం తీసేందుకు చాలా మంది ప్రయత్నిస్తుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారు. ఇలా చేయడం అత్యంత ప్రమాదకరం. కరిచిన పామును కచ్చితంగా గుర్తించాలి. అవసరమైతే దాన్ని పట్టుకుని ఆస్పత్రికి తీసుకురావాలి కూడా. అప్పుడే దానికి సంబంధించిన విరుగుడు మందును వైద్యులు ఇచ్చే అవకాశం ఉంది. లేకుంటే అది ఏ జాతికి చెందిన విషసర్పమో తెలియజేయాలి.

పాము కాటుకు వివాహిత మృతి


మృతిచెందిన ప్రవళ్లిక(ఫైల్)

ముమ్మిడివరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లిన ఓ వివాహిత పాముకాటుకు గురై మృతి చెందింది. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన యనమదల ప్రవళ్లిక (27) గురువారం తెల్లవారుజామున మరో మహిళతో కలిసి ఇంటి నుంచి వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఏదో కాటు వేసినట్టు అనిపించడంతో ఆమె పక్కనున్న మహిళకు చెప్పగా కాటువేసిన విషసర్పం వెళ్లిపోవడాన్ని వారు గమనించారు. ఈ విషయాన్ని ఆమె వెంటనే భర్త శివకు ఫోన్‌లో తెలపగా అతని సోదరుడితో కలిసి కారులో ఆమెను హుటాహుటీన ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ప్రవళ్లికకు భర్త శివ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కొండచిలువ హల్‌చల్

● గ్రామస్థుల చేతిలో హతం


గ్రామస్థుల చేతిలో హతమైన కొండచిలువ

నల్లజర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా నల్లజర్ల మండల కేంద్రమైన నల్లజర్లలో భారీ కొండచిలువ బుధవారంరాత్రి హల్‌చల్ చేసింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వెనుక ఉన్న మొక్కల్లో నుంచి సుమారు 10అడుగులు ఉండే భారీ కొండచిలువ పులి భాస్కరరావు ఇంటి సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆ మార్గంలో బైక్‌పై వస్తున్న భాస్కరరావు గుర్తించాడు. దీంతో స్థానికులను అప్రమత్తం చేసే సమయానికి ప్రక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లిపోయింది. అక్కడ నివాసం ఉండే స్థానికులు ప్రాణభయంతో కొండచిలువను ఏలా హతమార్చాలని అనేక ప్రయత్నాలు చేశారు. చివరికి ట్రాక్టర్ సహాయంతో పొదలు ఉన్న ప్రాంతాన్ని దున్ని వేయడంతో కొండచిలువ బయటపడింది. దీంతో స్థానికులు గునపాలు, కర్రలతో హతమార్చారు. భారీ కొండచిలువ మృతి చెందిందని నిర్ధారించుకున్నాక స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. మృతి చెందిన కొండ చిలువను అటవీ ప్రాంతంలో పూడ్చిపెట్టారు.



ఉభయ గోదావరి జిల్లాల వారధికి మరమ్మతులు

దిండి-చించినాడ మధ్య హెచ్చరిక బోర్డుతో మరమ్మతులకు సిద్ధమైన వారధి

● దిండి-చించినాడ మధ్య భారీ వాహనాల రాకపోకలు బంద్
● లైట్‌వెయిట్ వాహనాలకు మాత్రమే అనుమతి
● ఉభయగోదావరి జిల్లాల్లో వాహనాల మళ్లింపు
● కోనసీమ జిల్లా కలెక్టర్ ప్రకటన
● అధికారులతో సమీక్ష


అమలాపురంలో కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ వశిష్ఠనదిపై దిండి-చించినాడ మధ్య ఉన్న వారధి మరమ్మతుల కారణంగా భారీ వాహనాలను వివిధ మార్గాల ద్వారా మళ్లిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. లైట్‌వెయిట్ వెహికల్స్‌ను మాత్రమే ఈ వారధిపై అనుమతించడానికి నిర్ణయించారు. 216 జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా దిండి-చించినాడ మధ్య 1995లో నిర్మించిన ఈ వారధి ప్రస్తుతం అత్యవసర మరమ్మతులు చేయాల్సి ఉన్నందున వాటిని చేపట్టేందుకు వీలుగా వారధిపై ప్రయాణించే వాహనాలను వివిధ ప్రాంతాల గుండా మళ్లిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు గురువారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రకటించారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ, రోడ్డు రవాణాశాఖ అధికారులు, ఆర్టీసీ, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. గురువారం నుంచి వారధిపై భారీ వాహనాల రాకపోకలను మళ్లిస్తున్నట్టు ప్రకటించారు. కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ సూచనలతో ఈ వారధిపై అత్యవసర మరమ్మతులు చేపట్టాల్సిన దృష్ట్యా ఆ పనులు పూర్తయ్యే వరకు భారీ వాహనాలను మళ్లిస్తామని తెలిపారు. లైట్‌వెయిట్ వెహికల్స్ మాత్రం గరిష్ఠంగా గంటకు 30 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించడానికి మాత్రమే అనుమతి ఉందని మిగిలిన అన్ని వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించిన దృష్ట్యా ఆవిధంగా మరమ్మతులు పూర్తయ్యే వరకు వెళ్లాల్సిందిగా కలెక్టర్ మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, ఆర్టీసీ ఆర్‌ఎం రాఘవశ్రీనివాస్, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ సాయిశ్రీనివాస్, ఏఈ వెంకటరమణ తోపాటు అధికారులు పాల్గొన్నారు.

వాహనాలు మళ్లించిన రూట్లు ఇలా..

● కాకినాడ నుంచి నర్సాపురం-భీమవరం వైపు వెళ్లే వాహనాలు రావులపాలెం వంతెన మీదుగా సిద్ధాంతం నుంచి వెళ్లాలి.

● కాకినాడ, రామచంద్రపురం, మండపేట నుంచి వెళ్లే వాహనాలు రావులపాలెం-సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నర్సాపురం, భీమవరం వెళ్లాలి.

● అమలాపురం నుంచి నర్సాపురం, భీమవరం వైపు వెళ్లే వాహనాలు అమలాపురం, కొత్తపేట, రావులపాలెం, సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నర్సాపురం, భీమవరం వెళ్లాలి.

● తాటిపాక, రాజోలు నుంచి నర్సాపురం వైపు వాహనాలు తాటిపాక, పి.గన్నవరం, ఈతకోట, సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నర్సాపురం, భీమవరం చేరుకోవాలి.

● యానాం నుంచి పాలకొల్లువైపు వెళ్లే వాహనాలు ద్రాక్షారామం, రావులపాలెం, సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నర్సాపురం, భీమవరం వెళ్లాలి.

● నర్సాపురం నుంచి రాజోలు వైపు వచ్చే వాహనాలు దిగమర్రు, పాలకొల్లు, సిద్ధాంతం, రావులపాలెం మీదుగా రాజోలు చేరుకోవాలి.

స్మార్ట్ మీటర్ల బిగింపుపై అపోహలు వద్దు

● ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్

కాకినాడసిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఎటువంటి అపోహలు అవసరంలేదని, వీటివల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు ఛార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ (ట్రాన్స్‌కో) సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్ వెల్లడించారు. ఈమేరకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియకు సంబంధించిన వివరాలను గురువారం ఓ ప్రకటనలో వివరించారు. వినియోగం, బిల్లు నియంత్రణ వినియోగదారుల చేతుల్లోనే ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారుల సేవలలో పారదర్శకతను మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్‌ఎస్ పథకంలో భాగంగా అన్నిరాష్ట్రాల్లో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రారంభించిందన్నారు. ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు 2021 ఫిబ్రవరిలో ఏపీఈఆర్సీ ఆమోదం తెలిపిందన్నారు. దీని ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు వీటిని బిగిస్తున్నామన్నారు. వీటితో పాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన గృహ వినియోగదారులకు వీటిని అమరుస్తున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్లను అమర్చే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలపై విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవు..

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదుగాని, ఛార్జీలు గాని, మూమూళ్లుగాని చెల్లించాల్సి అవసరంలేదని ఎస్ఈ తెలిపారు. విద్యుత్ బిల్లుతోపాటు నెలవారీగా ఎటువంటి ఇన్‌స్టాల్‌మెంట్లు వసూలు చేయరని స్పష్టం చేశారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటువల్ల వినియోగదారులపై విపరీతమైన భారాలు పడతాయనే ఆందోళన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటర్లు పాతమీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవన్నారు. విద్యుత్ బిల్లులు పెరగవన్నారు.

మరింత పారదర్శకంగా ఏర్పడుతుంది..

పాతమీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల ద్వారా మరింత పారదర్శకత ఏర్పడుతుందని ఎస్ఈ పేర్కొన్నారు. వినియోగదారులకు ప్రస్తుత విద్యుత్ వినియోగాన్ని పర్యవేక్షించడానికి, వినియోగాన్ని సరిపోల్చడానికి స్మార్ట్‌మీటర్లు సహకరిస్తాయన్నారు. స్మార్ట్ మీటర్ల కన్స్యూమర్ యాప్ ద్వారా వారంలో 7 రోజులు 24 గంటలు కనెక్ట్ అయ్యి ఉంటాయన్నారు. ఫలితంగా వినియోగదారులు తమ వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. అధిక వినియోగాన్ని నియంత్రించుకుంటూ విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు సహకరిస్తాయని చెప్పారు. పవర్ ట్రిప్ అయిన సమయంలో త్వరితగతిన గుర్తించి తద్వారా విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్దరించేందుకు వీలు కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగాన్ని మెరుగ్గా ప్లాన్ చేయడంలో వినియోగదారులకు సహాయపడటానికి సంబంధించి వివిధ రకాల స్మార్ట్ వినియోగ అలెర్ట్‌లను ఎప్పటికప్పుడు అందిస్తామన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు సంబంధించి సందేహాల నివృత్తి కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912లో సంప్రదించవచ్చని ఎస్ఈ వెల్లడించారు.

బలవంతంగా వ్యభిచారంలోకి దింపారు

● భారతిని కఠినంగా శిక్షించాలి
● భారతి నుంచి మాకు ప్రాణ హాని ఉంది
● పోలీసులు భారతికి పూర్తిగా సహకారం అందించారు
● కాకినాడజిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన బాధితురాలు


దళిత సంఘాల నాయకులతో జిల్లా కలెక్టర్‌ను కలిసిన బాధితురాలు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 24(ఆంధ్ర జ్యోతి): తనను బలవంతంగా వ్యభిచారంలోకి దింపిన పెద్దాపురానికి చెందిన వ్యభిచార గృహం నిర్వాహకురాలు గొల్లవిల్లి భారతిని కఠినంగా శిక్షించాలని బాధితురాలు డిమాండ్ చేసింది. గురువారం ఆమె కాకినాడజిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిసి వినతిపత్రం అంద జేశారు. తనతో పాటు తన బిడ్డకి, తన సహాయకురాలికి భారతి నుంచి ప్రాణహాని ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సామర్లకోటకు చెందిన తాను ఏడేళ్ల క్రితం పెద్దాపురంలోని ఓ పెట్రోలు బంకులో పనిచేస్తుండగా భారతి పరిచయమైందన్నారు. తన ఇంట్లో పనిచేస్తే నెలకు రూ.15వేలు ఇస్తానని నమ్మబలికిందని చెప్పింది. తనను 17ఏళ్ల వయసులోనే బలవంతంగా వ్యభిచారంలోకి దింపిందని, ఈ క్రమంలో గర్భవతి అయ్యానంది. అయినప్పటికీ తనతో బలవంతంగా వ్యభిచారం చేయించింద ని, తాను ఒక పాపకు జన్మనిచ్చినట్లు వెల్లడించింది. తాను ప్రసవం సమయంలో తన బిడ్డను వేరుచేసి వేరేచోట పెంచారని, తాను వ్యభిచారం చేయకపోతే బిడ్డను చంపేస్తామని బెదిరించి వ్యభిచారం చేయించారన్నారు. తనతో బ్యాంకు ఖాతా తెరిపించి బ్యాంకుకు చెందిన ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకుని బెదిరించారని పేర్కొన్నారు. వారికి కానిస్టేబుల్, హోంగార్డులు సహకరించారని ఆరోపించారు. పెద్దాపురం ఎస్‌ఐకి, ప్రత్తిపాడు ఎస్‌ఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. ఈనేపథ్యంలో ఈ వ్యవహారాన్ని పెద్దాపురం డీఎస్పీకి, కాకినాడ ఎస్పీకి ఫిర్యాదు చేయగా తన బిడ్డను తనకు అప్పగించినట్లు పేర్కొన్నారు. తనకు ప్రాణహాని ఉన్నందున తనతోపాటు తన స్నేహితురాలు సాయికళతో కలిసి ఉంటున్నట్టు చెప్పారు. భారతితోపాటు ఆమెకి సహకరించిన పోలీసులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సంఘంలో తాను గౌరవప్రదంగా జీవించడానికి ఉపాధి కల్పించాలని కోరారు. ఆమె వెంట ఆంధ్ర మాలమహానాడు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, డీబీఎఫ్ జాతీయ సమన్వ యకర్త తోటి చెంగల్‌రావు, భైభీమ్‌రావ్ భారత పార్టీ పీఏసీ చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, దళిత నాయకులు ఉల్లం రవి, పిల్లి భూలోకం ఉండి మొత్తం వ్యవహారాన్ని కలెక్టర్‌కు వివరించారు. బాధితురాలికి రక్షణ కల్పిస్తామని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మృతదేహం ఇవ్వడంలో వైద్యుల నిర్లక్ష్యం

● నిరసన వ్యక్తం చేసిన కుమార్తెలు
● అసాధారణ మరణమని వైద్యుల సమాచారం
● అనుమానాస్పద మృతిగా కేసు
● పోస్టుమార్టం తర్వాత మృతదేహం అప్పగింత



రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుమార్తెలు


మృతుడు రాంబాబు

రంపచోడవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తమ తండ్రి మృతదేహాన్ని అప్పగించడంలో రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతుడి కుమార్తెలు శాంతి, దుర్గభవాని, బాపనమ్మ గురువారం ఆందోళన చేశారు. కాగా మృతుడి మరణం అసాధారణంగా ఉందని వైద్యుల సమాచారంతో మృతుడి పోలీసులు అనుమానాస్పద మృతిగా దర్యాప్తుచేపట్టారు. ఈ ఘటన పూర్వాపరాలు ఇలాఉన్నాయి. వై.రామవరం మండలం ఎర్రంరెడ్డి పాలేనికి చెందిన సుండం రాంబాబు(49) ఈనెల 19న రంపచోడవరం మండలం ఐ.పోలవరంలో ఉంటున్న తన కుమార్తె కారంశాంతి ఇంటికి వచ్చారు. బుధవారం రాత్రి రాంబాబుమంచంపైన అకస్మాతుగా స్పృహతప్పి పడిపోవడంతో ఆటో రిక్షాలో అతన్ని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాంబాబును పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను చనిపోయాడని తేల్చిచెప్పారు .కాగా మృతదేహాన్ని బంధువులకు తిరిగి అప్పగించకుండా అతడి మరణం అసాధారణంగా అనిపిస్తోందని రంపచోడవరం పోలీసులకు ఆసుపత్రి వైద్యులు సమాచారం అందించారు. దీంతో గురువారం మధ్యాహ్నం మృతుడి కుమార్తెలు శాంతి, దుర్గభవాని, బాపనమ్మ ఆసుపత్రి వైద్యులతీరుపై ఆసుపత్రి ఎదుటే ఆందోళనకు దిగారు. ఈ అంశం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో హుటాహుటిన పోలీసులు మృతుడికి శవపంచనామా నిర్వహించి వైద్యులకు నివేదిక ఇవ్వడంతో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. వైద్యుల నుంచి వచ్చిన మృతుడి అసాధారణ మరణ సమాచార అనంతరం పోలీసులు మృతుడి కుమార్తె నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేశారు. ఫిర్యాదు సారాంశం ప్రకారం మృతు డు ఫిట్స్ సమస్యతో బాధపడుతున్నాడని, ఆ కారణంగానే స్పృహతప్పి మరణించినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. అయినప్పటికీ దర్యాప్తులో భాగంగా శవపంచనామా అన ంతరం పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై రంపచోడవరం సబ్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకట్రావు తదుపరి దర్యాప్తు సాగిస్తున్నారు. తమ తండ్రి మరణం అసాధారణం కాకపోయినప్పటికీ పోస్టుమార్టం లేకుండా ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ వైద్యుల తీరును ప్రశ్నించిన కారణంగానే తమను ఇబ్బంది పెట్టే ఉద్దేశంతోనే తమ తండ్రి మృతదేహాన్ని పోస్టుమార్టం వరకు తెచ్చారని మృతుడి కుమార్తెలు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి వైద్యులు మాత్రం ఈ విషయంలో తామేమి నిర్లక్ష్యం వహించలేదని మృతుడిని ఆసుపత్రికి తీసుకువచ్చే సరికే మ రణించాడని మరణం అసాధారణం అనిపించి పోలీసులకు సమాచారం ఇచ్చామని అనంత రం పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించారని ఇందులో ఎక్కడా తమ జాప్యం లేదని పేర్కొన్నారు.

ఎవరు వీళ్లు? అయ్యో ఏం బాధొచ్చిందో?

● సమాచారం ఇవ్వాలని పోలీసుల విన్నపం


జీజీహెచ్ మార్చురీలో ఉన్న మృతదేహాలు

ఈ ఫొటోలో కనిపిస్తున్న మృతదేహాలను వన్‌టౌన్ పోలీసులు గురువారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. మార్కండేయ ఘాట్ సమీపంలో ఉన్న ఆహార ఫ్లోటింగ్ రెస్టారెంట్ వద్ద వరదనీరు వెనక్కు మళ్లుతోంది. ఆ నీటిలో ఒక పురుషుడు, ఒక మహిళ మృతదేహాలు తేలుతుండడాన్ని స్థానికులు గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారి గుర్తింపునకు ఎలాంటి ఆధారాలూ లభించలేదని సీఐ మురళీకృష్ణ తెలిపారు. సమాచారం తెలిసిన వారు 9440796574 నెంబరుకు సమాచారం15 అందించాలని ఆయన కోరారు. మృతదేహాలను జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచామన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. కాగా మృతదేహాలను పరిశీలిస్తే ప్రాణాలు కోల్పోయి ఒక రోజు మాత్రమే అవుతున్నట్లుగా ఉంది. వయసు సారూప్యతను బట్టి భార్యాభర్తలనే అనుమానం కలుగుతోంది. జీవితంలో వేదనతో వీరు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా లేక వేరే కారణం ఉందో పోలీసుల దర్యాప్తుల్లో తెలియాల్సి ఉంది.

-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

వ్యభిచార గృహంపై దాడి

● ముగ్గురు విటులు, నిర్వాహకురాలి అరెస్ట్

పెద్దాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం సుధా కాలనీలో గుట్టుగా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై డీఎస్పీ డి.శ్రీహరిరాజు పర్యవేక్షణలో సీఐ విజయ్‌శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. ముగ్గురు విటులు, వ్యభిచార గృహ నిర్వాహకురాలితో పాటు ఆమె సహాయకుడిని అరెస్టు చేశారు. నిందితులపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ మౌనిక తెలిపారు. ఈ దాడుల్లో ఒక మహిళను కాపాడి రెస్క్యూ హోమ్‌కు తరలించినట్టు చెప్పారు.

ఇద్దరు హిజ్రాలపై బైండోవర్

తాళ్లరేవు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు తాళ్లరేవు మండలంలోని సుంకరపాలెం బైపాస్ రోడ్డు నుంచి లచ్చిపాలెం ఆంజనేయస్వామి, పెట్రోలు బంకు వరకు ఉన్న హిజ్రాల స్థావరాలపై గురువారం కోరింగ ఎస్‌ఐ సత్యనారాయణ బృందం దాడి చేసింది. ఇద్దరు హిజ్రాలను అదుపులోకి తీసుకున్నారు. వారిని తాళ్లరేవు తహసీల్దారు కోర్టులో హాజరుపరిచి బైండోవర్ కేసు నమోదు చేశారు.

మృతదేహం డోర్ డెలివరీ కేసు మళ్లీ విచారణ తీర్పును నిలిపివేయండి

● హైకోర్టులో అనంతబాబు పిటిషన్
● క్వాష్ పిటిషన్ కూడా దాఖలు

రాజమహేంద్రవరం, జూలై24(ఆంధ్రజ్యోతి): దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసులో మళ్లీ పూర్తిస్థాయి విచారణ చేయాలని రాజమండ్రి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును నిలిపివేయాలని కోరుతూ ఈ కేసులో ప్రధాన నిందితుడు వైసీపీ ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయభాస్కరరావు అలి యాస్ అనంతబాబు గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మొత్తం ఈకేసును ఎత్తివేయాలని కోరుతూ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఆతీర్పు వచ్చేవరకూ రాజమండ్రి కోర్టు ఇచ్చిన తీర్పును నిలిపివేయాలని అందులో కోరారు. ఇది బహుశా శుక్రవారం లిస్ట్‌లో రావచ్చు. మరోప్రక్క ప్రముఖన్యాయవాది, హక్కుల ఉద్య మనేత ముప్పాళ్ల సుబ్బారావు ఈకేసు విషయం లో సిట్ అధికార్లకు, బాధితుల తరఫున పలు సూచనలు చేశారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

పెద్దాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ఆర్యవైశ్య సేవా సంఘం ప్రతినిధులు ఎం.శ్రీనివాసరావు, శ్రీరామ్‌ప్రకాష్, గోపాల్, రామకృష్ణ, చిన్నబాబు, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత'



మొక్క నాటుతున్న డాక్టర్ ఉమర్‌ఆలీషా, అదనపు జిల్లా జడ్జి శ్రీహరి, జడ్జీలు, న్యాయవాదులు

పిఠాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా, 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి సూచించారు. పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో 'నా మొక్క-నా శ్వాస' కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. మేక్ పిఠాపురం గ్రీన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, ఏపీపీ బత్తిన లక్ష్మణదొర, మన ఊరు-మన బాధ్యత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఏవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముదుగులమ్మ అమ్మవారి జాతర



ముదుగులమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భీమేశ్వరాలయం సమీపాన వేంచేసియున్న ముదుగులమ్మ అమ్మవారి జాతర మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గురువారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. శక్తి వేషధారణలు, డప్పుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. జాతరలో టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బదుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్ (బాబు), యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ (చిన్ని), ఎలిశెట్టి నాని, పైణ్ణి శ్రీనివాసు, వల్లూరి దొరబాబు, నక్కా శ్రీనువాసు, భీమేశ్వరాలయ ఈవో బళ్ల నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి రూ.లక్ష విరాళం



కలెక్టర్ షాన్‌మోహన్‌కి విరాళం చెక్కు ఇస్తున్న త్రినాథరావు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కాకినాడ శాఖ తరపున రూ.1,10,116 విరాళాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు గురువారం కలెక్టర్ షాన్‌మోహన్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ అర్బన్ తహసీల్దారు జితేంద్ర, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రావు, సంధ్యారాణి, రమ్య, దీపిక, హర్షిత, శివరామ్‌కుమార్, విజయ్‌కుమార్, ఎంటీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ ప్రక్రియ పరిశీలన

తాళ్లరేవు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవులో ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియను జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ గురువారం పరిశీలించారు. సపోటతోటలో పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరిస్తున్న విధానంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు సక్రమంగా వస్తోందా, డ్రైనేజీ వ్యవస్థ బాగుందా అని ఆరా తీశారు. డీపీవో వెంట డిప్యూటీ ఎంపీడీవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది వున్నారు.





కాకినాడ, పెద్దాపురంల్లో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

గ్రంథాలయోద్యమకారుడు 'అయ్యంకి' సేవలు చిరస్మరణీయం

కాకినాడ సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తుడైన గ్రంథాలయోద్యమకారుడు 'అయ్యంకి' సేవలు చిరస్మరణీయమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు పేర్కొన్నారు. కాకినాడ మెయిన్ రోడ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ ఆధ్వర్యాన గురువారం ప్రముఖ గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరావు అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఇన్‌చార్జి, ఉప గ్రంథాలయాధికారి కె.కిషోర్, కార్యాలయ సిబ్బంది ఎం.శ్రావ్య, టి.సాయివెంకట్రావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది ఎస్.రాజు, ఎన్‌వీఎస్ ఫణీంద్రకుమార్, జి.దుర్గాప్రసాద్, ఏవీఎస్ నాగేంద్రకుమార్, వి.అరుణ, పాఠకులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిబ్బంది సింగం బుల్లియ్య పాల్గొన్నారు.





కొత్తపల్లిలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు, పిఠాపురంలో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

'విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సమిష్టి పోరాటం'

పిఠాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సమిష్టి పోరాటం సాగించాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో సీపీఐ కార్యదర్శి సాకా రామకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు వీఎస్ రెడ్డి, కౌన్సిలర్లు సోమరౌతు లలితాదేవి, బోను దేవ, ఎంజే ఫెడ్రిక్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు ఏసుపాదం మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ మాట్లాడారని, ఇప్పుడు వాటిని సమర్థిస్తూ ఇళ్లకు బిగించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దీనిని మహిళలు వ్యతిరేకించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పెను భారంగా మారే అదానీ స్మార్ట్ కరెంట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రావు విజ్ఞప్తి చేశారు. కొత్తపల్లిలోని ముప్పారపు అచ్చియ్యమ్మ కల్యాణ మండపంలో గురువారం జరిగిన ఆ పార్టీ పిఠాపురం నియోజకవర్గ కార్యకర్తల సమా వేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వ విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. ఏఐసీసీటీయూ నాయకుడు గొడుగు సత్యనారాయణ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి నాయకుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నెలలో వారం రోజులు పిఠాపురంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్.అప్పలరాజు, పి.లోవకుమారి, బి.రాజేశ్వరి, సోనీ, మంగం చినబాబు, బి.నాగబాబు, అర్జునరావు, విజయకుమారి, ఆశీర్వాదం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





పిఠాపురంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ రూరల్‌లో మోటారు సైకిళ్లపై జనసైనికుల ర్యాలీ

'హరిహర వీరమల్లు' విజయోత్సవాలు

పిఠాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో హరిహర వీరమల్లు సినిమా విడుదలైన థియేటర్ల వద్ద గురువారం సంబరాలు నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన సినిమా కావడం, ఆయన ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండడంతో పవన్, మెగా అభిమానులతో పాటు జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు సంబరాల్లో పాలు పంచుకున్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కేక్ కట్ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మొగలి బాబ్జీ, పిఠాపురం ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, జనసేన నాయకులు బాలిపల్లి రాంబాబు, రెడ్డెం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విజయవంతం కావడంపై పవన్ అభిమానులు, జనసైనికులు గురువారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపు మేరకు జనసేన నాయకుడు మాదారపు తాతాజీ ఆధ్వర్యంలో సుమారు 200 బైక్‌లతో జనసైనికులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తిమ్మాపురం నుంచి అచ్చంపేట సెంటరు, సర్పవరం జంక్షన్, ఇంద్రపాలెం, చీడిగ, కొవ్వాడ, రేపూరు వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

'క్షేత్రస్థాయిలో సత్ఫలితాల సాధనకు కృషి చేయాలి'

సామర్లకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైతు సమూహానికి మద్దతు ఇవ్వగల సంస్థాగ, పర్యావరణ వ్యవస్థ, నెట్‌వర్క్ నిర్మించడంపై క్షేత్రస్థాయిలో సత్ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. సామర్లకోట వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆవరణలో రాష్ట్ర కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్‌ఎఫ్) ఆధ్వర్యంలో మూడు రోజులు జరిగే శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఏవో విజయకుమార్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల లాభదాయకత, స్థిరత్వాన్ని పెంచే విధంగా వ్యవసాయం నుంచి అధిక లాభాలను ఆశించే విధంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పలు వ్యవసాయ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో రైతులందరికీ చేర్చేలా యంత్రాంగం కృషి చేయాలన్నారు. రెండవ రోజు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన నిర్వహించాల్సి ఉందన్నారు. బంగారు కుటుంబంలో భాగంగా ప్రతి రైతుకు సేవా కేంద్ర సిబ్బంది మార్గదర్శకులై నిరుపేద అయిన కౌలు రైతు కుటుంబాన్ని దత్తత స్వీకరించాలని సూచించారు. ఏపీసీఎన్‌ఎఫ్ ప్రాజెక్ట్ జిల్లా మేనేజరు ఇలియాజర్ మాట్లాడుతూ వివిధ రకాల సూత్రాలు, ఏటీఎం మోడల్, కషాయాల తయారీ, వినియోగాన్ని సమగ్రంగా వివరించారు. ఆర్‌వైఎస్‌ఎస్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా లక్ష్యాలను వివరించారు. కాకినాడ ఏడీ కె.దుర్గాలక్ష్మి, మండల వ్యవసాయాధికారులు చీకట్ల సత్యనారాయణ, ఎన్.సత్యప్రసాద్, విస్తరణాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. సహజ సిద్ధమైన పశువుల ఎరువులు, పచ్చిరొట్ట, పీఎండీఎస్ వంటి వాటిని వినియోగించి సేంద్రియంగా పంటలను సాగు చేయాలన్నారు. రసా యన ఎరువుల వినియోగాన్ని సాధ్యమైనంత తగ్గించాలని కోరారు. ఏపీసీఎన్‌ఎఫ్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ ఏడీ నల్లి దైవకుమార్, ఏవో కొమ్మోజు సంజయ్‌కుమార్, ఏఈవోలు, వీపీఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

ఘనంగా కాటన్ వర్ధంతి




సర్పవరం జంక్షన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అధ్యక్షుడు రత్నప్రసాదరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలకు సాగునీరందించేందుకు వీలుగా ఆనకట్ట నిర్మించిన కాటన్ అపర భగీరథుడిగా ఖ్యాతిగడించారన్నారు. ఈ సందర్భంగా నిరుపేదలకు ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు.


నిబంధనలు పాటించకపోతే

లాడ్జీల నిర్వాహకులపై చర్యలు: డీఎస్పీ

సామర్లకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకపోయినా, అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని లాడ్జీల నిర్వాహకులను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు హెచ్చరించారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు గురువారం సామర్లకోట పోలీస్ స్టేషన్ ఆవరణలో సామర్లకోట పట్టణ పరిధిలోని 15 లాడ్జీల నిర్వాహకులతో సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇటీవలి కాలంలో లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాల జోరు అధికంగా ఉందని, ఫిర్యాదులు అందుతున్నందున జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ప్రధానంగా సామర్లకోటలో బస్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ రెండూ ఎదురెదురుగా ఉన్నందున... పలు ప్రాంతాలకు చెందిన విభిన్నమైన వ్యక్తులు రాకపోకలు అధికంగా ఉంటాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని లాడ్జి రూముల కోసం వచ్చేవారి వద్ద నుంచి సమగ్ర సమాచారాన్ని నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపరిచి వాస్తవికత ఆధారంగా మాత్రమే రూములు కేటాయించాని సూచించారు. కేవలం గంటల్లో అధిక ఆదాయం వస్తుందని ఆశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారికి రూములు ఇచ్చి వారిని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఏ సమయంలోనైనా లాడ్జీలను అకస్మికంగా తనిఖీ చేయనందున నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎస్పీ శ్రీహరిరాజు హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐ రమేష్, లాడ్జీల నిర్వాహకులు కంచర్ల రాజు, సేపేని సురేష్, నక్కా జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.







సామర్లకోటలో వాసవికన్యకాపరమేశ్వరి, పిఠాపురంలో మహాలక్ష్మి, దుర్గాడలో వేగుళ్లమ్మ

శాకంబరిగా అమ్మవార్ల దర్శనం

సామర్లకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కంచర్ల నాగేశ్వరరావు, కందుకూరి వీరభద్రరావు ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా సర్వాంగసుందరంగా అలంకరించారు. తొలుత అమ్మవారిని పంచద్రవ్యాలతో అభిషేకించారు. విశేష పుష్పార్చన పూజల అనంతరం దాతలు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. వాసవి వనితా క్లబ్ ప్రతినిధులు అమ్మవారికి చీర, సారె, పండ్లు, పూలను వేదమంత్రోచ్చారణల మధ్య అందజేశారు. సామర్లకోట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుసుమంచి శేషగిరిరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘ కార్యనిర్వాహక సభ్యులు కూరగాయల గొల్లబాబు, కాపుగంటి పైడిరత్నం, అధిక సంఖ్యలో ఆర్యవైశ్య సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతా వారి వీధిలో గల మహాలక్ష్మీ గణపతి సహిత సీతారామాంజనేయస్వామి ఆలయంలో (రామాలయం) మహాలక్ష్మి అమ్మవారిని శాకంబరీ దేవీగా అలంకరించారు. కాయగూరలు, పండ్లతో అమ్మవారికి అలంకారం చేశారు. కుంకుమ పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పా ట్లను పర్యవేక్షించారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామ దేవత వేగుళ్లమ్మ వారికి శాకంబరీ అలంకారం చేశారు. ఆషాఢ అమావాస్య సందర్భంగా అమ్మ వారిని కాయగూరలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేశవ్యాప్త ఉద్యమానికి పిఠాపురం నుంచి శ్రీకారం

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్

పిఠాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటంలో భాగంగా దేశవ్యాప్త ఉద్యమానికి పిఠాపురం నుంచి శ్రీకారం చుడుతున్నట్టు మాలమహానాడు, రాక్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ రత్నాకర్ వెల్లడించారు. పట్టణంలోని ఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ దేశవ్యాప్తంగా చేసిన రాజకీయ కుట్రగా అభివర్ణించారు. జనాభా ప్రకారం వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు చెప్తే ఎటువంటి ప్రామాణికం లేకుండా తెలుగు రాష్ట్రాల్లో ఎలా చేస్తారని ప్రశ్నించారు. అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజికవర్గాన్ని టార్గెట్‌గా చేసుకుని వర్గీకరణ చేస్తే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని మాల నాయకులు ఎందుకు ప్రశ్నించట్లేదని నిలదీశారు. ఎస్సీ కులాలను అణిచివేసే కుట్రలో భాగమని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తాము నిరంతర పోరాటం సాగిస్తామని తెలిపారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు కొప్పుల ప్రేమ్‌బాబు, బల్ల సత్యనారాయణ, సలాది బాబులు, ఏమని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కైలాస్ మానససరోవర్‌కు వెళ్లే హిందూ యాత్రికులకు

రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలి

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 24 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లిం మైనార్టీలకు ఇస్తున్న తరహాలోనే కైలాస్ మానససరోవర్ యాత్రకు వెళ్లే హిందువులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని నగర గణేశ ఉత్సవ సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సమితి సమావేశంలో చేసిన తీర్మానాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి గురువారం లేఖ, మెయిల్ ద్వారా తెలియజేశారు. అవసరమైతే ఆగస్టు నెలలో సమితి ప్రతినిధులు సీఎంను కలిసి ఈ విషయాన్ని తెలియజేస్తారని ప్రకటించారు. వినాయకచవితి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో పందిళ్లకు ఉచితంగా విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యెనిమిరెడ్డి మాలకొండయ్య, దూసర్లపూడి రమణరాజు, దువ్వూరి సుబ్రహ్మణ్యం, రంబాల వెంకటేశ్వరరావు, తుమ్మల పద్మజ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు ఐఐటీ-నీట్ పుస్తకాలు అందజేస్తున్న పిఠాపురం సీఐ, ఎస్‌ఐ

క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు ఎదగాలి

పిఠాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత స్థానాలకు ఎదగాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఏ విధంగా ముందుకెళ్లాలి అనే అంశంపై పలు సూచనలు ఇచ్చారు. ఐఐటీ-నీట్ స్టడీ మెటీరియల్ అందజేశారు. యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, మహిళలపై జరిగే సంఘటనలు, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పట్టణ ఎస్‌ఐ మణికుమార్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం చేయండి'

పెద్దాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని మున్సిపల్ అధికారులను మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆదేశించారు. పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైనేజీలు, పారిశుధ్య నిర్వహణ తదితర సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం వీటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కౌన్సిలర్లు తులికి సత్యభాస్కరరావు, అరెళ్ల వీర్రాఘవరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుబ్బరాజుకు సమస్యలు వివరిస్తున్న తూర్పుపేట గ్రామస్తులు

తూర్పుపేట గ్రామ అభివృద్ధికి

కృషి చేయాలి

తాళ్లరేవు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్, మండల ప్రతినిధి జక్కల ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును కోరారు. రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తిస్తే ఆయా ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే అన్నారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఐటీఐలో మిగిలిన సీట్లకు నేడు కౌన్సెలింగ్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో 2025-26 సంవత్సరానికి గాను రెండో విడత ప్రవేశం కోసం ఈ నెల 23, 24 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో సీట్లు రాని బీసీ-ఈ కేటగిరీ అభ్యర్థులు మిగిలిన సీట్ల భర్తీ కోసం శుక్రవారం ఉదయం 8 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్, కాకినాడ, కోనసీమ జిల్లాల అడ్మిషన్ల కన్వీనర్ వేణుగోపాల్‌వర్మ కోరారు.

రేపు ధ్యాన మందిరం ప్రారంభం

తుని రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): యోగా సొసైటీ ఆఫ్ ఇండియా రాంచీ ఆధ్వర్యంలో తుని డీ మార్టు పక్కనున్న చిట్టూరి మెట్రోలో నిర్మించిన యోగద సత్సంగ ధ్యానమండలిని శనివారం యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు స్వామి స్మరణా నందగిరి ప్రారంభించనున్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 7 వరకు క్రియ యోగ సాధనపై ప్రత్యేక సత్సంగం ఉంటుందని తుని ధ్యాన మందిరం అధ్యక్షుడు ఏఎస్ఆర్ శర్మ తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గంజాయి రవాణాచేస్తే కఠిన చర్యలు

● చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా



గ్రామస్థులతో మాట్లాడుతున్న చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా

మోతుగూడెం, జూలై 24(ఆంధ్రజ్యోతి): వై రామవరం మండలం బొడ్డగండి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పాలగడ్డ గ్రామాన్ని చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా సందర్శించి అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్ర, ఒడిస్సా బోర్డర్ ప్రాంతాలలో ఉన్న కొన్ని గ్రామాల నుంచి గం జాయి సరఫరా, రవాణా చేస్తున్నట్లు ఖచ్చితమైన సమాచారం వస్తుందన్నారు. ఎవరైనా గంజాయి సరఫ రా చేసినా, రవాణా చేసినా వారిపై చట్ట ప్రకారం కఠి నచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకసారి గంజాయి కేసులో దొరికితే వారిపై పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేసి వారి కదలికలను నిరంతరం తెలుసుకొని వారిపై ప్రత్యేకమైన నిఘా ఉంచుతామన్నారు. రెండు అంతకంటే ఎక్కువ గంజాయి కేసులు ఒక వ్యక్తిపై నమోదైతే వారిపై మాదకద్రవ్యాలు, మా నసిక చికిత్సలో అక్రమ రవాణా నివారణ పదార్థాల చ ట్టం ప్రకారం జైల్లో ఉంచుతామన్నారు. గంజాయి కేసు ల్లో ఇరుక్కుంటే గంజాయి వ్యాపారంపై సంపాదించిన ఆస్తులను సైతం సీజ్ చేస్తామన్నారు. గంజాయి రవా ణా గురించి సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచి వారికి తగిన పారితోషకం అందిస్తామ న్నారు. అనంతరం అడిషనల్ ఎస్పీ డొంకరాయి పోలీ స్‌స్టేషన్‌ను సందర్శించి మావోయిస్టులు, గంజాయి సరఫరా చేసే వారిపై ఇన్ఫర్మేషన్‌ని ఎప్పటికప్పుడు తె లుసుకొని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డొంకరా యి ఎస్ఐ శివకుమార్‌కి సూచనలు జారీ చేశారు.

'కూటమి ప్రభుత్వంతో సుపరిపాలన'



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

దేవీపట్నం, జూలై 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అన్నివర్గాలకు సుపరిపాలన అందిస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. గురువారం మండలంలోని శరభవరం, దేవారం గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి ఎమ్మె ల్యే శిరీష హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం అందించి సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు, మాజీ మండలాధ్యక్షుడు మధుసూధనరావు, బాబురావు, దేవీపట్నం సర్పంచ్ రాజామణి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ జొన్నల రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బురుగువాయి తండాలో 'తొలి అడుగు'

ఎటపాక, జూలై 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనలో అన్నివర్గాల ప్రజలకు ప్రజా సంక్షేమ పథకాల అమలుతోపాటు అభివృద్ధి బాట పట్టాయని టీడీపీ నేత కణితి మధు అన్నారు. బురుగువాయి తండాలో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ఉండేటి రమేష్, బాదావత్ స్వామి, గుగులోత్ శ్రీను, బోడ సీత పాల్గొన్నారు.

పశువులు రవాణా చేస్తున్న ఆటో సీజ్

రాజవొమ్మంగి జూలై 24(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి అల్లూరి జంక్షన్‌వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా పశువులను తరలిస్తున్న ఆటోను పోలీసులు సీజ్ చేశారు. అడ్డతీగల గ్రామానికి చెందిన వేమ వరప్రరాజు అనే వ్యక్తి పశువులను ఆటోలో తరలిస్తుండగా అల్లూరి జంక్షన్ వద్ద పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

చింతూరు సీఐగా గోపాలకృష్ణ



చింతూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): చింతూరు సీఐగా సీహెచ్ గోపాలకృష్ణను నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటి వరకు ఈయన రాజవొమ్మంగి సర్కిల్ పరిధిలోని మారేడుమిల్లిలో విధులు నిర్వహిస్తుండేవారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా చింతూరు సీఐగా బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక విధుల్లో చేరాల్సి ఉంది. ఇప్పటి వరకు చింతూరు సీఐగా విధులు నిర్వర్తించిన తెల్లం దుర్గాప్రసాద్‌ని పాడేరు మహిళా పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు.

పదవులు ముగుస్తున్నా.. పనులు జరగడంలేదు

● సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ధ్వజం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కూనవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తమ ఐదేళ్ల పాలన ముగుస్తున్నా అభివృద్ధి పనులు మాత్రం జరగడం లేదని సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారులపై ధ్వజమెత్తారు. మండలంలో కోతులగుట్టలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రజలు తమను ఎన్నుకుని ఐదేళ్లు కావొస్తుందని కానీ ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయన్నారు. మండలంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. గిరిజన విద్యార్థులకు సరైన విద్య అందడంలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వరదల సమయంలో వరద బాధితులకు ఉపయోగపడే బోదునూరు, ఏడురాలపల్లి రోడ్డుకు దశాబ్దాలు గడుస్తున్నా మోక్షం రావడంలేదని విమర్శించారు. ఈ రహదారి నిర్మిస్తే మండలంలో వరద బాధితులకు రాకపోకలకు నిత్యావసర వస్తువుల సరఫరాలోను ఎటువంటి అంతరాయం ఉండ దన్నారు. అదేవిధంగా వరద పునరావాస కేంద్రాల్లో తాగునీరు కోసం చేతిపంపులను ఏర్పాటు చేస్తుంటే అటవీ శాఖాధికారులు అడ్డుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్నాధరావు, ఎంపీపీ పాయం రంగమ్మ, జడ్పీటీసీ గుజ్జ విజయ్, ఆర్ఐ జల్లి సత్యనారాయణ, ఐకెపి ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

కొమురం భీం విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కూనవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు గిరిజనుల ఆరాధ్యదైవం కొమరం భీం విగ్రహం ధ్వంజం చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు పాయం వెంకయ్య అన్నారు. విగ్రహం ధ్వంసం చేసిన వారిని ఇప్పటికే పోలీసులు గుర్తించారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు కరక పవన్ తదితరులు ఉన్నారు.

'ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వం'

కూనవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ప్రజలు మెప్పు పొందిందని టీడీపీ నాయకులు, అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవెల్లి భాస్కరరావు అన్నారు. సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా కూనవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇప్పటికే ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. త్వరలోనే మిగిలిన సూపర్ సిక్స్ పథకాలను సైతం అమలు చేస్తుందని తెలిపారు. హెచ్.రవి, చెలకాని ఉమామహేశ్వరరావు, సోమయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో విజృంభిస్తోన్న వైరల్ జ్వరాలు

- కిటకిటలాడుతున్న ప్రైవేట్ ఆసుపత్రులు
- డెంగ్యూ, తదితర జ్వరాలతో సతమతం
- ఆసుపత్రుల్లో కన్పించని వైద్య సిబ్బంది
- విశాఖ నుంచి వైద్యుల రాక



కోటనందూరులో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో రోగులతో ఉన్న వార్డు

కోటనందూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభించడంతో రోగులు భయందోళనకు గురవుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో వైరల్ జ్వరాలతో పాటు డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలడంతో పలువురు మంచాన పడ్డారు. జ్వరంతో పాటు కీళ్లనొప్పులు తదితర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్లేట్‌లెస్ సంఖ్య తగ్గుతుండటంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లోని పరిస్థితి రోజు రోజుకు దిగజారుతుండటంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. మండలంలోని కోటనందూరు, కాకరాపల్లి, పాతకొట్టాం, అల్లిపూడి, కేఈ చిన్నయ్యపాలెంలోని ప్రైవేటు క్లీనిక్‌లన్నీ కిటకిటలాడుతున్నాయి. పాతకొట్టాం, కోటనందూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులు విశాఖపట్టణం నుంచి వస్తున్నట్టు సమాచారం. వైద్యుల రాకపోకలు ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొనడంతో రోగులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యుల రాకపోకలు తెలియక పలువురు రోగులు ప్రైవేటు క్లీనిక్‌లను ఆశ్రయిస్తున్నట్టు తెలిసింది. స్థానికంగా ఉండాల్సిన ఏఎన్ఎంలు కూడా హాజరుపడిన తర్వాత సొంత వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

శివారులో ఉండటంతో .. అధికారులు రారు

కోటనందూరు మండలం జిల్లాకు శివారు ఉండడంతో అధికారులు రావడం లేదని తెలిసింది. దీన్ని అవకా శంగా తీసుకుని ఇక్కడ వైద్యులు, స్థాని కంగా ఉండా ల్సిన సిబ్బందితో పాటు ఎవరు కూడా సరిగా ఉండటం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు రోగులు కోరుతున్నారు.

డ్రోన్లతో నిఘా

కోటనందూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం కోటనందూరులో డ్రోన్లతో బస్టాండ్‌తో పాటు రోడ్డుపై మద్యం తాగే వారిపై చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బస్టాండ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వ్యాపారస్తులు ఆక్రమణల నుంచి తొలగాలని, లేనిపక్షంలో చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా చౌడేశ్వరిమాత జయంతి

తునిరూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లపువీధి గౌరీ శంకర సమేత వీరభద్రస్వామి ఆలయంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాన గౌరీ శంకర్ ఆధ్వర్యంలో చౌడేశ్వరి మాత జయంతిని జరిపారు. ఆషాడ అమావాస్య దేవాంగ కులదేవత చౌడేశ్వరి మాత జయంతిని పురస్కరించుకుని కుందెం కిరణ్ కుమార్, కుమారి దంపతులు పలు పూజలు చేశారు. అనంతరం ఊరేగించి అన్న సమారాధన జరిపారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

ఏలేశ్వరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ అధికారుల నేతృత్వంలో రైతులకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందవచ్చన్నారు.

సురేఖ మృతి తీరని లోటు



ప్రత్తిపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో సాయుధ గిరిజన రైతాంగ పోరాట యోధుడు విప్లవ కవి అమరుడు కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి జీవిత భాగస్వామి కామ్రేడ్ సురేఖ పాణిగ్రాహి గురువారం సాయంత్రం మృతి చెందడంపై సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలంలు విచారం వెలిబుచ్చారు. ప్రత్తిపాడు లిబరేషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ శ్రీకాకుళంలోని ముందువడ్డపాడు కాలనీలో సురేఖ పాణిగ్రాహి మృతి చెందారని ఆమె మృతి విప్లవ ఉద్యమాలకు తీరని లోటని తెలిపారు. ఆమె మృతిపై లిబరేషన్ నాయకులు సంతాపం తెలిపారు.

ఉపాధి పనులు ముమ్మరం చేయాలి



ఎంపీడీవోలు, ఏపీవోలతో సమావేశమైన ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద గురువారం నియోజకవర్గ ఎంపీడీవోలు, ఏపీవోలు సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు.ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులన్నీ నియోజకవర్గంలో నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గోశాలల నిర్వహణ పనులు సత్వరం పూర్తయ్యేలా అధికారులు చూడాలన్నారు. ఉపాధి పథకంలోని వ్యవసాయ ఆధారిత పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో ప్రత్తిపాడు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, శంఖవరం ఎంపీడీవో ఎ. లక్ష్మి రెడ్డి, రౌతులపూడి ఎంపీడీవో జి.శివరామకృష్ణ, ఏలేశ్వరం ఎంపీడీవో కె. సూర్యనారాయణ, ప్రత్తిపాడు ఏపీవో కుమార్‌స్వామిలతో పాటు నాలుగు మండలాల ఏపీవోలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో వర్షం

ప్రత్తిపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన కారణంగా గురువారం ప్రత్తిపాడులో వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరజల్లులతోకూడిన వర్షం పడుతూనే ఉంది. వరుసుగా 5 రోజుల నుంచి వర్షాలు కురుస్తూ ఉండటంతో ఖరీఫ్ వ్యవసాయ పనులకు ఈ వర్షాలు ఎంతో మేలు చేకూరుస్తాయని రైతులు ఆశాబావం వ్యక్తం చేశారు.

యాజమాన్య పద్ధతి పాటించాలి

ప్రత్తిపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): వరినాట్లు వేసేటప్పుడు యాజవన్య పద్ధతులు పాటించాలని ఏవో జోకా అమృత సూచించారు. పొలాల్లోని మురుగునీరు పోయే సౌకర్యాలు కల్పించుకోవాలన్నారు.

తల్లిదండ్రుల వద్దకు చేరిన బాలికలు

జగ్గంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో ఇళ్లనుంచి వెళ్లిపోయిన బాలికలను పోలీసులు ఎటకేలకు పట్టుకున్నారు. మల్లిశాల గ్రామానికి చెందిన ఓ బాలిక, జగ్గంపేటకు చెందిన మరో బాలిక కొద్దిరోజుల క్రితం తమ ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. మల్లిశాల బాలికను భీమవరంలో, జగ్గంపేట బాలికను వేరే ప్రాంతంలో గుర్తించిన పోలీసులు వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

పీ-4 సర్వేపై గ్రామసభ

ప్రత్తిపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో నిర్వహించిన పీ4 సర్వేలో 1280 కుటుంబాలను గుర్తించినట్లు ఆ గ్రామ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాల్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద గురువారం నిర్వహించిన పీ4 గ్రామసభకు సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి అధ్యక్షత వహించారు. సొసైటీ చైర్మన్ దాసం శేషారావు, ఎంపీటీసీ జువ్వల సుజాత బాబులు, దళిత నేత ఊబా కృపావరం, బీజేపీ మండల అధ్యక్షుడు ఊటావీరబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

జగ్గంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి జగ్గంపేట ఏడీఏ జి.శ్రీనివాస్ అధ్యక్షతన వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంవల్ల రైతులకు కలిగే లాభాలను వీఏఏ, వీహెచ్ఏలకు వివరించారు. ప్రకృతి సిద్ధమైన పశువుల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, పీఎండీఎస్ వాటిని వాడడం ద్వారా మనం తినే ఆహార పదార్థాల్లో కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమానికి జగ్గంపేట వ్యవసాయ అధికారి ఎస్. నరసింహం, గండేపల్లి వ్యవసాయ అధికారి ఆర్.శ్రీరామ్, ఉద్యాన వన అధికారి శ్రీవల్లి, ఈఏవోలు చంద్రమౌళి, వసంత, జగ్గంపేట, గండేపల్లి మండలాల వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

తునిరూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో నర్సీపట్నం-గుడిపాడు రైల్వేస్టేషన్ మధ్య రైలు ఢీకొని ఒకవ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన పరమేశ్వర్ పాండురంగ్ పవర్(45) లారీ క్లీనర్‌గా పనిచేస్తూ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోకి లోడ్ అన్‌లోడ్ చేసుకుని తిరిగి తన గ్రామం వెళ్లేందుకు యలమంచిలిలో రైలు ఎక్కాడు. మార్గమధ్యలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహానికి శవపంచనామా చేసి బంధువులకు అప్పగించామని రైల్వే ఎస్ఐ తెలిపారు.


'ఆదిత్య'లో ఫండమెంటల్స్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో శిక్షణ

గండేపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫండమెంటల్స్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్ అనే ఆధునిక అంశంపై ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రారంభమైనట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనెల 29 వరకు ఈ కోర్సు జరుగుతుందన్నారు. ప్రాక్టికల్ డెమో అందించడానికి ప్రత్యేకమైన శిక్షణ ప్రణాళిక రూపొందించామన్నారు.

టీడీపీ నేతకు సతీవియోగం

ప్రత్తిపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బుద్ధరాజు రామకృష్ణరాజు సతీ వియోగానికి గురయ్యారు. ఆయన భార్య రమణి (57) గురువారం ఆకస్మికంగా మృతిచెందారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, లంపకలోవ సొసైటీ చైర్మన్ వరుపుల రామకృష్ణ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ బుద్ధరాజు గోపీరాజు, రామకృష్ణరాజు కుటుంబసభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణరాజు(మీసాలరాజు), సీబీఎన్ ఆర్మీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్, ప్రత్తిపాడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల కొండలరావు (నాని) వారిని పరామర్శించారు.

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిరి హోమం



కార్యక్రమంలో భక్తులు

అన్నవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో గురువారం అమావాస్య పర్వదినం సందర్భంగా ప్రత్యంగిర హోమం ఘనంగా జరిగింది. ఉదయం తొమ్మిది గంటలకు గణపతిపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించి జపములు, పారాయణ చేశారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

'సుపరిపాలన'లో ప్రత్తిపాడుకు రాష్ట్రంలో 5వ స్థానం



ఎమ్మెల్యేను కలిసిన నియోజకవర్గ బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు,జూలై 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ అత్యంత ప్రతిష్టాతకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం విజయవంతం కావడంతో రాష్ట్రంలో ప్రత్తిపాడు నియోజకవర్గం 5వ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. గురువారం ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ఏడాది పాలనపై నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలను అభిప్రాయాలను తెలుసుకుని మై టీడీపీ యాప్‌లో నమోదు చేశామన్నారు. ఇందులో భాగంగా నెల్లూరు రూరల్ అగ్రస్థానంలో ఉండగా, ప్రత్తిపాడు నియోజకవర్గం ఐదో స్థానంలో నిలిచిందన్నారు. నియోజకవర్గంలో 89,563 గృహాలు ఉండగా, 70,712 గృహాలను సందర్శించడం జరిగిందన్నారు. దీన్ని విజయవంతం చేసిన టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

●ఎమ్మెల్యేను సన్మానించిన బీజేపీ నేతలు

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను గురువారం నియోజకవర్గ బీజేపీ నేతలు పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఇటీవల బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమితులైన తేజోమూర్తుల ఉషారాణితోపాటు నూతన కార్యవర్గ సభ్యులను బీజేపీ నేతలు ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. నియోజకవర్గ బీజేపీ నాయకులు కందా వీరాస్వామి, ఇంటి వీర నాగేశ్వరరావు, కాయల మల్లికార్జునరావు,దేవర రామకృష్ణ, గవిరెడ్డి మాణిక్యం, పెనుబోతుల రమేష్, కించు జోగిరాజు, సంధ్యారాణి, కృష్ణారావు, శ్రీను, నానిబాబు, సిద్ధా శివ, తదితరులు పాల్గొన్నారు.

'కామ్రేడ్ రాజారావు విప్లవ ఆశయాలను సాధిద్దాం'

జగ్గంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో యాదవ కల్యాణ మండపంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ సాగంటి రాజారావు నాలుగో వర్ధంతి సభ ను గురువారం మధ్యాహ్నం నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఘనంగా నిర్వహించారు. దీనికి జిల్లా నాయకుడు మరుకుర్తి ఏసు అధ్యక్షత నిర్వహించారు. రాష్ట్ర నాయకులు ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా రాజారావు చిత్రప టానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభలో న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వెంకట్ నాయుడు, జె.సత్తిబాబు, బొజ్జిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జి.ఆదినారాయణ, ఎం.జేసు, రఘువులు, జి.బాలరాజు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

వాకపల్లిలో బోనాల జాతర



బోనాల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వాకపల్లి శ్రీ కాశీ లక్ష్మీప్రసన్ననాంద మాతాజీ ఆధ్వర్యంలో ఆషాఢమాసం ముగిసిన సందర్భంగా గురువారం బోనాల జాతర నిర్వహించారు. గ్రామంలోని మాతా మహాశక్తి పీఠం వద్ద నుంచి ఈ జాతర కోలాహలంగా ప్రారంభమై ప్రధాన రహదారిపై శాంతి ఆశ్రమం సమీపంలోని సత్తెమ్మ తల్లి ఆలయం వరకు కొనసాగింది. మంగళవాయిద్యాలు, గరగల నృత్యాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య కళాక్షేత్ర ఉత్తర కోస్తా జిల్లాల అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ఆరుగురు మందుబాబులకు జరిమానా

ప్రత్తిపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఆరుగురికి ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ గోపినాథ్ గురువారం రూ.10,000 చొప్పున మొత్తం రూ.60,000 వేలు జరిమానా విధించారని ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పబ్లిక్ స్థలాల్లో మద్యం తాగే వారికి, మద్యం సేవించి డ్రైవింగ్ చేసే వారికి ఇది ఒక హెచ్చరిక అని, అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఒకవేళ దాడులకు తెగబడితే చర్యలు తప్పవన్నారు.

డైరెక్టర్ మహేష్ చంద్రకు మాతృ వియోగం



త్రివేణి (ఫైల్)

శంఖవరం, జూలై 24(ఆంధ్ర జ్యోతి): ప్రేయసిరావే, అయోధ్యరామయ్య, హనుమంతు చిత్రాల దర్శకుడు మహేష్ చంద్రకు మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి ఉత్తరాది త్రివేణి(80) గురువారం ఉదయం మరణించారు. ఆమె హిందీ పండిట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం కత్తిపూడిలో ఉంటున్నారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న పిఠాపురంలో అలా మొదలైంది సినిమా షూటింగ్ కొద్దిరోజులుగా పిఠాపురం పరిసరాల్లో జరుపుకుంటోంది. ఇటీవల షెడ్యూల్ పూర్తవడంతో హైదరాబాద్ వెళ్లారు. ఆమె అంత్యక్రియలు కత్తిపూడిలో జరపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు నరేష్, ప్రసాద్ సోదరులు ఉన్నారు.

ఓటీపీతో విద్యామిత్ర ప్రక్రియ పూర్తి చేయాలి

తొండంగి, జూలై 24(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల అథంటికేషన్ కోసం ప్రభుత్వం ఓటీపీ ఆప్షన్ ఇచ్చినందున త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ షేక్ బాబ్జి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రుల అథంటికేషన్ గతంలో బయోమెట్రిక్ విధానంలో మాత్రమే తీసుకునేవారని దాన్ని ఇప్పుడు మొబైల్‌కు ఓటీపీ పంపడం ద్వారా పూర్తి చేయవచ్చన్నారు. దూర ప్రాంతంలో పనుల నిమిత్తం వెళ్లిన తల్లిదండ్రులకు ఇది ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. అన్ని పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు ఇప్పటికే పూర్తి చేసినవి కాకుండా మిగిలిన వాటిని ఓటీపీ నమోదు ద్వారా పూర్తి చేసి నూరు శాతం అథంటికేషన్ పూర్తి చేయాలని ఎంఈఓ షేక్ సూచించారు.

వీడని ముసురు... ప్రజల ఇబ్బందులు

తొండంగి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వీడని ముసురుతో గురువారం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జల్లులతో కూడిన వాతావరణం నెలకొంది. మిగిలిన ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదవుతున్న నేపథ్యంలో మండలంలో ముసురు వాతావరణం ఏర్పడింది. దీంతో ప్రజలు బయటకు వెళ్ళలేక ఇబ్బందులకు గురయ్యారు.

'ఆదిత్య'లో అప్లికేటర్ శిక్షణ

ఆదిత్య యూనివర్శిటీలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అల్ట్రాటెక్ సిమెంట్, నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త భాగస్వామ్యంతో ఒకరోజు అప్లికేటర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

తలుపులమ్మకు సప్తనదీ జలాలతో ఘటాభిషేకం

● వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

● లోవలో ముగిసిన ఆషాఢమాస వేడుకలు



అమ్మవారికి అభిషేకం జరుపుతున్న దృశ్యం

తునిరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవలో ఆషాడ మాసోత్సవా లు ముగింపును పురస్కరించుకుని ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు గురువారం అమ్మవారికి సప్తనదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పములు, మహాదాశీర్వచనం, తీర్థప్రసాద వినియోగం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలతో లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు పూర్తి అయినట్టు ఆలయ పురోహితులు చెప్పారు. కార్యక్రమాలు ఈవో విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురిపై కేసు

కిర్లంపూడి, జూలై 24(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ డ్రైవ్‌లో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్ష, ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.